


నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784.

## అదానీ వార్షిక వేతనం
# రూ.10.41 కోట్లు..
### సొంత ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ!



దేశంలోని తోటి పారిశ్రామికవేత్తలు, తన గ్రూప్ కంపెనీల్లో పని చేస్తున్న కొంత మంది ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ కావడం గమనార్హం

ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 08 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- సోమవారం - 09 - జూన్ - 2025



## ఏపీ రాష్ట్ర చరిత్రలోనే
# భారీగా ప్రమోషన్లు.. వైకాపా సానుభూతి ఉద్యోగులకు కూడా..

ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటన

"టీచర్ ట్రాన్స్‌ఫర్స్ యాక్ట్"ను అమల్లోకి

# దేశంలో కోవిడ్ కలకలం..
## ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

- దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదు
- దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుంది
- కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి
- కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి

2లో



## వక్స్ (సవరణ) చట్టం 2025కు
# రాష్ట్రపతి ఆమోదం



### చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు
### అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు
### లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు

ఢిల్లీ: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వక్స్ (సవరణ) చట్టం 2025 కు ఏప్రిల్ 5న అధికారికంగా ఆమోదం తెలిపారు. ఈ చట్ట సవరణ బిల్లుపై లోక్‌సభ, రాజ్యసభల్లో హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో మిగతా.. 2లో

## దత్తాత్రేయది పేరుకు హిందుత్వం
# మతం భారతీయం

- ★ అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ
- ★ దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదం
- ★ హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ
- ★ రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యం: వెంకయ్య





హైదరాబాద్: హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయది పేరుకు హిందుత్వం మతం భారతీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ అని అభివర్ణించారు. దత్తాత్రేయ కోరుకున్నది జనహితం ఆయనది లౌకికవాదమని కొనియాడారు. లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్‌గా నిలిచారని సీఎం ప్రశంసించారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమర (ఆదివారం) జరిగింది. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో దత్తాత్రేయ పుస్తకం రచించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కిషన్‌రెడ్డి, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ, ఏపీ గవర్నర్ నజీర్, ఏపీ మంత్రి సత్యకుమార్, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు కేంద్రమంత్రులు హాజరయ్యారు. .ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, మిగతా.. 2లో



2లో

# కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

- కాళేశ్వరం కమిషన్ విచారణపై ఈటల సంచలన వ్యాఖ్యలు
- తుమ్మల నాగేశ్వర్ రావు వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఈటల

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం తనకు లేదని బీజేపీ నేత, తెలంగాణ మాజీ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరైన ఈటల.. కేసీఆర్ ను రక్షించేందుకే వాస్తవాలను దాచిపెట్టారన్న ఆరోపణలపై మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం 'మిగతా.. 2లో



# కొత్త మంత్రులకు శుభాభినందనలు తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...
## ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

- వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరికి మంత్రి పదవులు
- శాసనసభ ఉపసభాపతిగా రామచంద్రు నాయక్ నియామకం

## విజయవాడలో
# 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

- విజయవాడలో 'కొనికి' పేరుతో నూతన సెలూన్ ప్రారంభం
- ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- పాల్గొన్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు
- సెలూన్ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు
- ట్రెండీ దుస్తుల్లో ఆకట్టుకున్న పవన్ కల్యాణ్




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆదివారం విజయవాడలో సందడి చేశారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన "కొనికి" అనే సెలూన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ మిగతా.. 2లో

## "వేశ్యలు" అంటూ చేసిన
# వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

- రాజధాని మహిళలపై సాక్షి టీవీలో జర్నలిస్ట్ కృష్ణంరాజు వివాదాస్పద వ్యాఖ్యలు
- జర్నలిస్ట్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర ఆగ్రహం, ఖండన
- స్త్రీ జాతిని అవమానిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేసిన సీఎం
- మాజీ సీఎం జగన్ తీరుపై చంద్రబాబు అసంతృప్తి, విచారం
- మహిళల మనోభావాలు దెబ్బతీసిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ మిగతా.. 2లో



2లో

## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...
# రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా

హైదరాబాదులో బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ

హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి


ఇటీవల నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా జరిగిన సంభాషణ వెల్లడించిన వైనం

## తెలంగాణ క్యాబినెట్ విస్తరణ..
# నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

- ➤ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం
- ➤ మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక
- ➤ గడ్డం వెంకటస్వామి వారసుడిగా..
- ➤ ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి
- ➤ వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది




హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగింది. రాజ్‌భవన్‌లో నూతన మంత్రులుగా జి.వివేక్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వాకిటి శ్రీహరి ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు పాల్గొన్నారు. మంత్రివర్గ విస్తరణలో కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి మిగతా.. 2లో



# మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం: ప్రధాని మోదీ

- కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి
- 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు
- "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర



మొదటి పేజీ తరువాయి

# దత్తాత్రేయది పేరుకు హిందుత్వం
# మతం భారతీయం

ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ,జెంటిల్‌మెన్‌కు ప్రతిరూపం దత్తాత్రేయ అని అన్నారు. దత్తాత్రేయను దత్తన్న అని అభిమానంగా పిలుచుకుంటారన్నారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. "దత్తాత్రేయ కోరుకుంది జనహితం.. ఆయనది లౌకిక వాదం. ఆయన పాటించేది మత సామరస్యం. 'అలయ్ బలయ్' పేరుతో అన్ని వర్గాలను ఏకతాటిపైకి తెచ్చారు. అందరినీ కలిపేందుకు వేదిక రూపొందించారు. ఆయనకు విరోధులు ఎవరూ ఉండరు. ఆయనకు ఏ రాజకీయ పార్టీ అనే వ్యత్యాసం ఉండదు. దత్తాత్రేయది ఆదర్శ రాజకీయ జీవితం. ప్రజాసమస్యలపై ప్రభుత్వాలు, సీఎంలకు లేఖలు రాశారు. లేఖలు రాయడంలో అంబాసిడర్‌గా నిలిచారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం అనునిత్యం పనిచేశారు. ఉత్తర, దక్షిణ భారత్ ప్రజలతో ఆయన మమేకమయ్యారు" అని చంద్రబాబు తెలిపారు

**రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు**

**ముఖ్యం: వెంకయ్య**

బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ పుస్తకావిష్కరణలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని మాట్లాడారు. 'ప్రజల కథే నా ఆత్మకథ' పేరుతో బండారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ రచించారని తెలిపారు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ సిద్ధాంతాలు ముఖ్యమని ఉద్ఘాటించారు. విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని సూచించారు. రాజకీయ విమర్శలు సంస్కారవంతంగా ఉండాలని చెప్పారు. అసభ్యంగా మాట్లాడే వారికి ఎన్నికల్లో సరైన జవాబివ్వాలని వెంకయ్యనాయుడు తెలిపారు.

ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. మనోహర్ షిండే వల్లే తాను ఇవాళ ఈ స్థాయిలో ఉన్నానని చెప్పారు. "ఆర్ఎస్సెస్ నా ప్రాణం, నా ఆత్మ, నా సర్వం. వి రామారావు నన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చి నడిపించారు. ఇంద్రాసేనారెడ్డి కూడా నా వెన్నంటే ఉన్నారు. రాజకీయాలు వృత్తి, వ్యాపారం కోసం కాదు.. సమాజం కోసం. సమాజం కోసం పనిచేయాలి. పేదల వృద్ధికి కృషి చేయాలి"అని అన్నారు.

తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రసంగిస్తూ.. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఇది కేవలం వ్యక్తిగత ప్రయాణం కాదని, గత 60 ఏళ్లలో భారత రాజకీయ, సామాజిక మార్పులకు ప్రతీక అని అన్నారు. ఇలాంటి వ్యక్తిని అందించినందుకు దత్రాత్రేయ తల్లిదండ్రులకు దేశం కృతజ్ఞతలు చెబుతోందన్నారు. "దత్తాత్రేయ.. వాజ్‌పేయి, అద్వానీ వంటి ప్రముఖులతో కలిసి పనిచేశారు. పని చేసిన ప్రతి హోదాలో పేదలకు మేలు చేసేందుకు విశేషంగా కృషి చేశారు. అలయ్ బలయ్ ద్వారా అందరినీ ఒక తాటిపైకి తీసుకొస్తున్నారు. అధికారం కేవలం పరపతి, పేరు కోసం కాదు.. సేవ చేసేందుకు అనేందుకు ఆయన జీవితం ఒక నిదర్శనం"అని అన్నారు. కార్యక్రమానికి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ, ఏపీ, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జిష్ణుదేవ్ వర్మ, జస్టిస్ అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, భాజపా ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు కె.కేశవరావు, వి.హనుమంతరావు తదితరులు హాజరయ్యారు.

## "వేశ్యలు" అంటూ చేసిన వ్యాఖ్యలను ఉపేక్షించే పరిస్థితే లేదు

మొదటి పేజీ తరువాయి

అమరావతి: రాజధాని అమరావతి ప్రాంత మహిళలను ఉద్దేశించి సాక్షి టీవీ ఛానల్ లో కృష్ణంరాజు అనే జర్నలిస్ట్ తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. రాజధాని గురించి, అక్కడి మహిళల వ్యక్తిత్వాన్ని కించపరిచేలా 'వేశ్యలు' అంటూ చేసిన దారుణమైన వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. రాజకీయ, మీడియా ముసుగులో సాగుతున్న ఇలాంటి వికృత చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. "తన సొంత మీడియా చానల్ ద్వారా జరిగిన ఈ దారుణాన్ని ఒక మాజీ ముఖ్యమంత్రిగా ఉన్న వ్యక్తి ఇప్పటికీ ఖండించకపోవడం, స్త్రీ జాతికి క్షమాపణ చెప్పకపోవడం మరింత విచారకరం. ఆడబిడ్డలను గౌరవించే సంస్కృతి మనది. స్త్రీమూర్తులను ఆరాధించే సమాజం మనది. ఇది మన సంప్రదాయం. మన భారతీయ జీవన విధానం. ముఖ్యంగా మన తెలుగు ప్రజల విషయానికి వస్తే ఆడబిడ్డను, అమ్మను ఎంతో ఆదరణతో చూస్తాం. అలాంటి మన రాష్ట్రంలో రాజకీయ కక్షతో, మీడియా విశ్లేషణల పేరుతో నిస్సిగ్గుగా ఏకంగా మన తల్లులు, చెల్లెళ్లపై దారుణ వ్యాఖ్యలు చేయడం క్షమించరాని నేరం. వాళ్లు ఎప్పుడూ అనుసరించే ఈ విష సంస్కృతిపై తిరుగుబాటుగా గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చినా వారి వైఖరిలో మార్పు రాలేదనేది సుస్పష్టం.రాజధానిపై విషం చిమ్మే కుట్రలో గట్టు దాటి మహిళల మనోభావాలను గాయపరచిన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటాం. గత విధ్వంస ప్రభుత్వం పై రాజధాని మహిళల పోరాటాన్ని మనసులో పెట్టుకుని ఆ ప్రాంత మహిళలపై ఉద్దేశ్యపూర్వకంగా, నీచాతినీచంగా చేసిన ఈ వ్యాఖ్యలు మొత్తం మహిళా సమాజాన్నే అవమానించడం. మహిళలను గౌరవించే, వారి ఆత్మగౌరవానికి అండగా నిలిచే కూటమి ప్రభుత్వం ఈ నీచ సంస్కృతికి చెక్ పెట్టే బాధ్యత తీసుకుంటుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

## కేసీఆర్ ను కాపాడాల్సిన అవసరం ఏంటీ

మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి స్పందించారు. ఆదివారం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినపుడు ఆర్థిక మంత్రిగా ఉన్నానని, ఆ సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, వాటిలో తన పాత్రను కమిషన్ ముందు వెల్లడించినట్లు చెప్పారు. ఈ విషయంలో ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే కాంగ్రెస్ నేతలు ఇలాంటి కామెంట్స్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ ఉప సంఘం లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టే లేదని తెలిపారు. కాళేశ్వరంలోని అనేక ప్రాజెక్టుల రీడిజైనింగ్ను కేబినెట్ సబ్ కమిటీ సూచించింది. త్వరలోనే అన్ని జీవోలు, సబ్ కమిటీ నిర్ణయాలు, సూచనలు బయటపెడతా అని చెప్పారు.

**మంత్రి తుమ్మల వ్యాఖ్యలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టు అంశం అసలు కేబినెట్ ముందుకే రాలేదంటూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కేబినెట్లో చర్చించకుండా ప్రభుత్వంలో ఏదీ జరగదని గుర్తుచేశారు. అలాంటిది కాళేశ్వరం ప్రాజెక్టుపై కేబినెట్ చర్చించలేదనడం సరికాదని అన్నారు. ప్రాజెక్టు విషయంలో తీసుకున్న ప్రతీ నిర్ణయంపై కేసీఆర్ అందరితో సంతకాలు తీసుకున్నారని చెప్పారు. ఈ విషయం అప్పటి మంత్రులు తుమ్మల, జూపల్లి, కడియం శ్రీహరిలకు కూడా తెలుసని అన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

## విజయవాడలో 'సెలూన్ కొనికి' ప్రారంభోత్సవం...

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా పవన్ కల్యాణ్, యార్లగడ్డ వెంకట్రావు ఇరువురూ సెలూన్ నిర్వాహకులకు తమ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపారం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి పవన్ కల్యాణ్ లేత నీలం రంగు రౌండ్ నెక్ టీషర్ట్, నలుపు రంగు షార్ట్స్ ధరించి వచ్చారు. ఆయన క్యాజువల్ లుక్ అందరినీ ఆకట్టుకుంది, ట్రెండీగా కనిపించిందని పలువురు వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

## ఏపీ రాష్ట్ర చరిత్రలోనే భారీగా ప్రమోషన్లు..

అమరావతి: ఏపీ రాష్ట్ర చరిత్రలోనే వేల సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లు లభించాయి. వీరిలో వైకాపా సానుభూతి ఉద్యోగులు కూడా ఉన్నారు. అయితే, ఈ ప్రమోషన్లలో ఎలాంటి తారతమ్యాలు కల్పించ లేదని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. కానీ ప్రభుత్వ ఉద్యోగులు మాత్రం కొందరికి అన్యాయం జరిగిందంటూ ఆరోపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి, పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఎలాంటి మానవ ప్రమేయం లేకుండా, కేవలం సర్వీసునే ప్రామాణికంగా తీసుకుంటున్న ఈ ఆన్‌లైన్ విధానంపై కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం వ్యాప్తి చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని పాఠశాల విద్యాశాఖ ఉపాధ్యాయులకు స్పష్టంచేసింది. పైరవీలకు, రాజకీయ జోక్యానికి ఆస్కారం లేదని భరోసా ఇచ్చింది. ఈ యేడాది రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా, ఎటువంటి రాజకీయ ప్రమేయానికి తావులేకుండా ఆన్‌లైన్ ద్వారా 4,853 పదోన్నతులు, 35,235 బదిలీలు విజయవంతంగా పూర్తి చేసినట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఉపాధ్యాయ సంఘాలతో పలు దఫాలుగా చర్చించి, వారి సూచనలు పరిగణనలోకి తీసుకుని, ప్రక్రియను మరింత పారదర్శకంగా మార్చేందుకు ప్రభుత్వం "టీచర్ ట్రాన్సఫర్స్ యాక్ట్"ను అమల్లోకి తెచ్చింది. ఈ చట్టం ప్రకారం అన్ని బదిలీలను కేవలం ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. 2025 విద్యా సంవత్సరానికి సంబంధించి, ఆన్‌లైన్ బదిలీల్లో ఉపాధ్యాయుల సౌలభ్యం కోసం పలు నూతన సాంకేతిక సౌకర్యాలు ప్రవేశపెట్టారు. మండల కేంద్రం నుంచి పాఠశాల దూరం, క్లస్టర్లలో ఖాళీల వివరాలు స్పష్టంగా చూపుతున్నారు. ఆప్షన్లను పలుమార్లు మార్చుకునే వీలు, అవగాహన వీడియోలు, సాంకేతిక సందేహాల నివృత్తికి సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. తప్పనిసరి బదిలీ అయ్యేవారు తమ ఆప్షన్లను ఖచ్చితంగా ఖరారు చేయాల్సి ఉంటుంది. గతంలోని మాన్యువల్ కౌన్సెలింగులో ఖాళీల వివరాలు వెంటనే తెలియక సీనియర్లు నష్టపోవడం, రోజుకు కొద్దిమందికే కౌన్సెలింగ్ సాధ్యమవడం, సుదూర ప్రాంతాల నుంచి వచ్చి గంటల తరబడి వేచి చూడాల్సిన ఇబ్బందులు వంటి సమస్యలుండేవని విద్యాశాఖ గుర్తుచేసింది. ఆన్‌లైన్ విధానం వీటికి తెరదించి, సమయం, శ్రమ ఆదా చేయడంతో పాటు, పైరవీలకు పూర్తి అడ్డుకట్ట వేసిందని అధికారులు స్పష్టం చేశారు. సీనియారిటీకి న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 1998లో బదిలీల కోసం కౌన్సెలింగ్ విధానం ప్రారంభం కాగా, మాన్యువల్ పద్ధతిలోని లోపాలను అధిగమించేందుకు 2015లో తొలిసారిగా వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ విధానం ఉపాధ్యాయులలో నమ్మకాన్ని పెంపొందించింది. గత ప్రభుత్వం కూడా ఇదే ఆన్‌లైన్ విధానాన్ని కొనసాగించగా, ప్రస్తుత ప్రభుత్వం దానిని మరింత మెరుగుపరిచి, సాంకేతికత సాయంతో ఎలాంటి అపోహలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు విద్యాశాఖ వెల్లడించింది.

## వక్ఫ్ (సవరణ) చట్టం 2025కు
# రాష్ట్రపతి మోదం

మొదటి పేజీ తరువాయి



హృదయపూర్వక చర్చలు జరుగగా, అధిక సంఖ్యలో సభ్యులు బిల్లుకు మద్దతు ప్రకటించారు. లోక్‌సభలో ఈ బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటు వేశారు. రాజ్యసభలో అనుకూల ఓట్లు 128, వ్యతిరేక ఓట్లు 95. ఈ బిల్లుపై విపక్షాల నుండి తీవ్ర విమర్శలు వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం దృఢంగా తన వైఖరిని కొనసాగించింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్, ఈ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదు అని, ఏ మత విశ్వాసాలనైనా దెబ్బతీయాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. ఈ సవరణ ద్వారా వక్ఫ్ ప్రాపర్టీల నిర్వహణ, పర్యవేక్షణ, పారదర్శకతకు సంబంధించి కొన్ని కీలక మార్పులు చేయబడ్డాయి. వక్ఫ్ బోర్డుల పని విధానంలో సమీక్ష, ఆస్తుల లెక్కల నిర్వహణ, ప్రజల న్యాయబద్ధమైన వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. సారాంశంగా, వక్ఫ్ (సవరణ) చట్టం 2025 ముస్లిం మైనారిటీల ఆస్తుల పరిరక్షణను సమర్థవంతంగా చేస్తుందని కేంద్రం పేర్కొంది. అయితే ఈ చట్టంపై సవాళ్లు, చర్చలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

# తెలంగాణ క్యాబినెట్ విస్తరణ..
# నూతన మంత్రుల ప్రమాణస్వీకారం

మొదటి పేజీ తరువాయి

కాంగ్రెస్ అధిష్ఠానం సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన మంత్రులను ఎంపిక చేసింది. దీనిలో భాగంగానే ఎస్సీల నుంచి వివేక్ (మాల), అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ (మాదిగ), బీసీల నుంచి వి.శ్రీహరి ముదిరాజ్‌కు అవకాశం కల్పించారు.

**గడ్డం వెంకటస్వామి వారసుడిగా..**

గడ్డం వివేక్ చెన్నూరు నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన ప్రముఖ కాంగ్రెస్ నేత జి.వెంకటస్వామి వారసుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపీగా గెలిచారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013లో తెరాస(ప్రస్తుతం భారాస)లో చేరారు. 2014 ఎన్నికల సమయంలో తెరాస నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరారు. పెద్దపల్లి స్థానంలో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2016లో మళ్లీ వివేక్ తెరాసలో చేరారు. ఎంపీ టికెట్ దక్కకపోవడంతో 2019లో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. 2019 ఎన్నికల తర్వాత భాజపాలో చేరారు. 2023లో మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్.. చెన్నూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2024లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపీగా వివేక్ కుమారుడు వంశీ గెలిచారు.

**ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి**




అడ్లూరి లక్ష్మణ్‌ను ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే మంత్రి పదవి వరించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలిచారు. భారాస అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 2,229 ఓట్ల తేడాతో విజయం సాధించారు. 1968లో ఆయన కరీంనగర్ జిల్లాలో జన్మించారు. పెద్దపల్లి కళాశాలలో ఐటీఐ పూర్తి చేశారు. 1986-1994 మధ్య కరీంనగర్ జిల్లా ఎన్ఎస్‌యూఐ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 మధ్య ఏపీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2006లో ధర్మారం జడ్పీటీసీగా పోటీ చేసి గెలిచారు. 2009లో ధర్మపురి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2010-2012 మధ్య కరీంనగర్ జడ్పీ ఛైర్మన్‌గా పనిచేశారు. 2009లో అసెంబ్లీ ఎన్నికలు, 2010 ఉపఎన్నికలో ఓడారు. 2013-14 మధ్య ఏపీ ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు. 2018 నుంచి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు.

**వాకిటి శ్రీహరి రాజకీయ నేపథ్యమిది**

ఎమ్మెల్యే అయిన తొలిసారే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి దక్కింది. ఆయన 1972లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి గెలిచారు. భారాస అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డిపై 17,522 ఓట్ల తేడాతో గెలిచారు. 2014-2018 మధ్య మక్తల్ జడ్పీటీసీ, జడ్పీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2001-2006 మధ్య మక్తల్ సర్పంచిగా ఉన్నారు. నారాయణపేట్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శిగా పని చేశారు.

## మోదీ, చంద్రబాబు వద్ద చదువుకుని...
## రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్: హైదరాబాదులో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర అంశాన్ని అందరితో పంచుకున్నారు. ఇటీవల తాను ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి హాజరయ్యానని, ఈ సందర్భంగా ఆయనతో కలిసి మధ్యాహ్న భోజనం చేశానని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మోదీ... చంద్రబాబు గారిని చూపించి మీ సన్నిహితుడు కూడా ఇక్కడే ఉన్నారు అని చెప్పారు. అప్పుడు నేను... స్కూల్ మీ (బీజేపీ) వద్ద చదువుకున్నాను... కాలేజి ఆయన (చంద్రబాబు) వద్ద చదువుకున్నాను... ఇప్పుడు రాహుల్ గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నాను అని చెప్పాను. దాంతో అందరూ నవ్వేశారు" అని రేవంత్ రెడ్డి వివరించారు.

## మస్క్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చిన ట్రంప్

అమెరికా: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన వివాదాస్పద వ్యయ బిల్లుకు అనుకూలంగా ఓటు వేసే రిపబ్లికన్లను శిక్షించేందుకు మస్క్ ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ట్రంప్ హెచ్చరించారు. ట్రంప్ ప్రతిపాదించిన "బిగ్ బ్యూటిఫుల్ బిల్"ను మస్క్ తీవ్రంగా విమర్శించడంతో ఈ వివాదం మొదలైంది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఉన్న కొందరు చట్టసభ సభ్యులు, బిల్లుకు మద్దతిచ్చే రిపబ్లికన్లపై ప్రైమరీ ఎన్నికల్లో పోటీకి నిధులు సమకూర్చాలని గత ఏడాది అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి మద్దతు ఇచ్చిన మస్క్‌ను కోరారు. దీనిపై స్పందించిన ట్రంప్.. "అతను (మస్క్) అలా చేస్తే చాలా తీవ్రమైన పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుంది" అని ఎన్బీసీ న్యూస్‌తో అన్నారు. మస్క్ "అగౌరవంగా" ప్రవర్తించారని కూడా ట్రంప్ ఆరోపించారు. మస్క్‌తో సంబంధాన్ని చక్కదిద్దుకోవాలనే కోరిక తనకు లేదని, అతనితో మాట్లాడే ఉద్దేశం కూడా లేదని ట్రంప్ స్పష్టం చేశారు.

# దేశంలో కోవిడ్ కలకలం..
# ఆరు వేలు దాటిన యాక్టివ్ కేసులు

ఢిల్లీ: భారత్‌లో రోజురోజుకూ కోవిడ్-19 యాక్టివ్ కేసులు పెరగడం ఆందోళన రేకెత్తిస్తోంది. దేశంలో కొత్తగా 1,131 కోవిడ్ కేసులు నమోదయ్యాయి. దీంతో కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. దేశంలో ఆదివారం ఉదయం 8 గంటల నాటికి కోవిడ్-19 యాక్టివ్ కేసుల సంఖ్య 6,133కి చేరుకుందని ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కోవిడ్‌తో దక్షిణాది రాష్ట్రాల్లో ఆరుగురు మృతి చెందారు. కేరళలో ముగ్గురు, కర్ణాటకలో ఇద్దరు, తమిళనాడులో ఒకరు మృతి చెందారు. కేరళలో 1950, గుజరాత్‌లో 822, బెంగాల్‌లో 693, మహారాష్ట్రలో 595, కర్ణాటకలో 366, ఏపీలో 86, తెలంగాణలో 10 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కోవిడ్ మృతుల సంఖ్య కూడా పెరగడంతో మరో 'కరోనా వేవ్'ముంచెత్తుతుందా అన్న భయాలు సైతం వివిధ వర్గాల ప్రజల్లో నెలకొన్నాయి. కేరళలో అత్యధిక పాజిటివ్ కేసులు నమోదు కాగా, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమబెంగాల్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, రాజస్తాన్ తర్వాతి స్థానాల్లో నిలుస్తున్నాయి. కేరళలో శనివారం నాటికి (గత 24 గంటల్లో) 192, గుజరాత్‌లో 107, పశ్చిమబెంగాల్‌లో 58, కర్ణాటకలో 15, ఆంధ్రప్రదేశ్‌లో 12 కొత్త యాక్టివ్ కేసులు వెలుగు చూశాయి. అదేవిధంగా ఇతర రాష్ట్రాల్లోనూ యాక్టివ్ కేసులు పెరుగుతున్నాయి. ప్రస్తుతం కేసుల వ్యాప్తికి కారణమైన ఒమిక్రాన్ సబ్‌వేరియెంట్లు, లీనియేజ్‌లు ఎగువ శ్వాసకోశ వ్యవస్థ (అప్పర్ రెస్పిరేటరీ) పైనే ప్రభావం చూపుతున్నందున పెద్దగా భయపడాల్సిన పనిలేదని వైద్య నిపుణులు అంటున్నారు.

## కొత్త మంత్రులకు శుభాభినందనలు
# తెలిపిన సీఎం రేవంత్ రెడ్డి...
### ముగ్గురూ తొలిసారి ఎమ్మెల్యేలే!

తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ

నూతన మంత్రులు, డిప్యూటీ స్పీకర్ నియామకం

హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్ విస్తరణ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, నూతన మంత్రులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విషెస్ తెలియజేశారు. నూతన మంత్రులుగా వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి అవకాశం దక్కించుకున్న సంగతి తెలిసిందే. అదేవిధంగా, శాసనసభ ఉపసభాపతి (డిప్యూటీ స్పీకర్)గా రామచంద్రు నాయక్ నియమితులయ్యారు. దీనిపై రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు. "నూతన మంత్రులుగా బాధ్యతలు స్వీకరించబోతున్న వివేక్ వెంకట స్వామి గారు, అడ్లూరి లక్ష్మణ్ గారు, వాకిటి శ్రీహరి గారికి నా అభినందనలు. శాసనసభలో ఉప సభాపతి బాధ్యతలు స్వీకరించబోతున్న రామచంద్రు నాయక్ గారికి నా అభినందనలు..." అని పేర్కొన్నారు. కాగా, మంత్రివర్గంలో చాన్స్ దక్కించుకున్న ఈ ముగ్గురు కూడా తొలిసారి ఎమ్మెల్యేలు కావడం విశేషం. వివేక్ వెంకటస్వామి గతంలో ఎంపీగా పనిచేసిన సంగతి తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన చెన్నూరు నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. ఇక వాకిటి శ్రీహరి మక్తల్ అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందగా, అడ్లూరి లక్ష్మణ్ ధర్మపురి సెగ్మెంట్లో విజేతగా నిలిచారు.

## ఇదిగో ఇందుకే మేం దాడులు చేస్తున్నాం.. ఇజ్రాయెల్ సైన్యం

ఇజ్రాయెల: గాజాలో హమాస్ ను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్%-%ఐడీఎఫ్) దాడులు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆసుపత్రులపైనా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని, అమాయక ప్రజలను చంపేస్తోందంటూ ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వివిధ దేశాధినేతలు ఇప్పటికే ఇజ్రాయెల్ తీరును తప్పుబడుతున్నారు. ప్రధాని నెతన్యాహు ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తాజాగా గాజాపై దాడులను సమర్థించుకుంటూ ఐడీఎఫ్ తాజాగా ఓ వీడియో బయటపెట్టింది. ఖాన్ యూనిస్‌లోని ఒక కీలకమైన ఆస్పత్రి కింద హమాస్ సొరంగం కనుగొన్నామంటూ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలోని దృశ్యాలను గమనిస్తే.. యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్‌లో ఓ సొరంగం కనిపిస్తోంది. దీనిని హమాస్ కమాండ్-అండ్-కంట్రోల్ సెంటర్‌గా ఉపయోగిస్తోందని, ఇక్కడి నుంచే ఇజ్రాయెల్ పై దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. సొరంగంలో ఆయుధాలు, నిఘా సామగ్రి ఇతర పరికరాలు ఉంచిన కంట్రోల్ రూములు కూడా కనిపిస్తున్నాయి. హమాస్ తన ప్రయోజనాల కోసం గాజాలోని ఆసుపత్రులను స్థావరాలుగా వాడుకుంటూ పౌరుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది. 2023లోనూ ఇదే విధంగా గాజాలోని అతిపెద్ద ఆస్పత్రి అల్ షిఫా కింద సొరంగాన్ని కనుగొన్నట్లు ఐడీఎఫ్ పేర్కొంది. వాటిని ధ్వంసం చేయడానికి తాము దాడులు చేసినప్పుడు అక్కడ ఉన్న అమాయకులు సైతం ప్రాణాలు కోల్పోతున్నారని వివరించింది.

## అదానీ వార్షిక వేతనం రూ.10.41 కోట్లు..
### సొంత ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ!

ఇంటర్నెట్‌డెస్క్: దేశంలోని అత్యంత సంపన్నుల్లో రెండో స్థానంలో ఉన్న అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.10.41 కోట్ల వేతనం అందుకున్నారు. అయితే, దేశంలోని తోటి పారిశ్రామికవేత్తలు, తన గ్రూప్ కంపెనీల్లో పని చేస్తున్న కొంత మంది ఎగ్జిక్యూటివ్‌ల కంటే తక్కువ కావడం గమనార్హం. ఓడరేవులు, ఇంధన రంగాల్లో విస్తరించిన తొమ్మిది లిస్టెడ్ కంపెనీల్లో కేవలం రెండింటి నుంచి మాత్రమే ఆయన వేతనం తీసుకున్నారు. 2023-24లో రూ.9.26 కోట్లుగా ఉన్న ఈ మొత్తం 2024-25లో 12 శాతం పెరిగింది. గ్రూప్‌లో ప్రధాన సంస్థ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.26 కోట్లు అందుకున్నారు. ఇతర అలవెన్సులు, ప్రయోజనాల రూపంలో మరో రూ.28 లక్షలు ఆయనకు లభించాయి. దీంతో ఆయన మొత్తం రూ.2.54 కోట్లు తీసుకున్నాయి. ఇది అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న రూ.2.46 కోట్ల కంటే కొంచెం ఎక్కువ. మరో కంపెనీ అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ నుంచి రూ.1.8 కోట్ల వేతనం, రూ.6.07 కోట్ల కమిషన్ (లాభాల్లో వాటా) తో కలిపి రూ.7.87 కోట్లు అందుకున్నారు. అంతకు ముందు ఏడాది ఈ మొత్తం రూ.6.8 కోట్లుగా ఉంది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన ముకేశ్ అంబానీ వార్షిక వేతనం రూ.15కోట్లుగా ఉండేది. అయితే, కొవిడ్ తర్వాత ఆయన వేతనాన్ని తీసుకోవడం లేదు. ఇక భారతీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీత్ మిత్తల్ (2023-24లో రూ.32.27 కోట్లు), రాజీవ్ బజాజ్ (రూ.53.75 కోట్లు), పవన్ ముంజాల్ (రూ.109 కోట్లు), ఎల్అండ్‌టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రమణ్యం (76.25 కోట్లు), ఇన్ఫోసిస్ సీఈవో సలీల్ పరేఖ్ (రూ.80.62కోట్లు) వేతనాలు అదానీ కంటే అధికంగా ఉన్నాయి. అదానీ గ్రూప్‌లోని కొందరు ఎగ్జిక్యూటివ్‌ల జీతాలు కూడా గౌతమ్ కంటే ఎక్కువ. ఏఈఎల్ సీఈఓ వినయ్ ప్రకాశ్ రూ.69.34 కోట్లు, అదానీ గ్రీన్ ఎనర్జీ సీఈఓ వినీత్ ఎస్.జైన్ రూ.11.23 కోట్లు అందుకున్నారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్ ఇండెక్స్ ప్రకారం.. అదానీ సంపద విలువ 82.5 బిలియన్ డాలర్లు. హిండెన్‌బర్గ్ నివేదిక వల్ల ఆయన ఆస్తుల విలువ సుమారు 150 బిలియన్ డాలర్ల మేరకు తగ్గింది. అయినప్పటికీ గతేడాదిలో రెండు సార్లు ఆసియా అత్యంత ధనవంతుడిగా నిలిచారు. ఇక.. ప్రపంచంలోని సంపన్నుల జాబితాలో ముకేశ్ అంబానీ 104 బిలియన్ డాలర్ల సంపదతో 17వ స్థానంలో, అదానీ 20వ స్థానంలో ఉన్నారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యంగా పనిచేశాం: ప్రధాని మోదీ

దిల్లీ: మహిళల అభివృద్ధి కోసం ఎన్డీఏ సర్కార్ చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతృత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించారు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై నేటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "విద్యా, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ సర్కార్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవాన్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకాలు అమలు చేశాం. పేద మహిళల ఆరోగ్యం దృష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇచ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతంగా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో'ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని మీరంతా చూశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లుగా కృషి చేస్తున్నాం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## వధువు వరులను ఆశీర్వదించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వెస్లీ, డీజీ



యాచారం సూర్య న్యూస్ ( జూన్ 08):. మండల పరిధిలో చింతపట్ల గ్రామానికి చెందిన సిపిఎం మండల కమిటీ సభ్యులు పిరాటి యాదమ్మ వెంకటయ్య, దంపతులకు చెందిన ప్రథమ పుత్రుడు క్రాంతి కుమార్ వివాహం యాచారం మండల కేంద్రంలో డి ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా జరిగింది. ఆదివారం (లాహిరి క్రాంతి కుమార్) ఈ వివాహానికి ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, డిజి నరసింహారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య, బి మధుసూదన్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు పాలకుర్లా లక్ష్మీపతి గౌడ్, ఓరుగంటి యాదయ్య గౌడ్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వధూవరులను ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకల్లో వరుడు బాబాయి యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పిరాటి అంజయ్య, వివాహానికి అతిథులుగా హాజరైన నాయకులకు, బంధుమిత్రులకు, ప్రేమగా పలకరించి, ఈ వేడుకలకు స్వాగతం పలికారు. వధువు వరుడు పిల్లాపాపలతో, ఆయురారోగ్యాలతో, జీవిత దాపత్యంతో , జీవితం సాగాలని ఈ పెళ్లికి వచ్చిన వారందరూ ఆశీర్వదించారు. ఈ పెళ్లి వేడుకలో వేలాది మంది హాజరయ్యారు.

## కస్తూర్బా గాంధీ లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రారంభం

-ఆంగ్లంలోనే విద్యా బోధన

-అర్హత కలిగిన విద్యార్థులందరూ -దరఖాస్తు చేసుకోవాలి

యాచారం సూర్య ( న్యూస్ 08):. యాచారం మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ విద్యాలయం లో 2025 సం, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంటర్ మొదటి సంవత్సరములో ( మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) కోర్సు, 40 సీట్లు కేటాయించింది. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆంగ్లంలోనే విద్యను బోధిస్తారు. ఫోన్ నెంబర్ 8331833426 సంప్రదించగలరు.

## ఆరుట్లలో శ్రీ మల్లిఖార్జున స్వామి రియల్ ఎస్టేట్.కార్యాలయం ప్రారంభం



మంచాల, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్9 : మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో రైస్ మిల్ చౌరస్తాలో సుంకరి పాండరినాథ్ గౌడ్ మారగోని రాజయ్య గౌడ్ ఏర్పాటు చేసుకున్న శ్రీ మల్లి ఖర్జున స్వామి రియల్ ఎస్టేట్ కార్యాలయం ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసిన అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం పీఠాధిపతి శంకరానందస్వామిజి. అనంతరం వ్యాపారం అభివృద్ధిచెందాలని ఆశీర్వదించారు. ప్రారంభోత్సవంలో పాల్గొన్నమంచాల వ్యవసాయ సహకార బ్యాంక్ చైర్మన్ వెదిరే హన్మంత్ రెడ్డి, డైరెక్టర్ జెనిగే వెంకటేష్ యాదవ్,కావాలి బుగ్గ రాములు,కావాలి శ్రీనివాస్ ముదిరాజ్,మాధగోని జంగయ్య గౌడ్,వెదిరే రమణ రెడ్డి, రావులబాషా,కంబాల పల్లి బుగ్గ రాములు,మార లక్ష్మన్,ఎన్నుదుల మహేష్ పాల్గొన్నారు.

## వర్షాకాలం ప్రజలు జర జాగ్రత్త




చింతపల్లి, ప్రభాత సూర్య ప్రతినిధి జూన్ 8 : చింతపల్లి మండలం మాల్ (వీటి నగర్) పట్టణ కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురిసి రోడ్లన్నీ జలమలమయ్యాయి. వర్షాల సమయంలో తగిన చర్యలు పాటించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలం సమీపించి ఉరుములు, మెరుపులు, పిడుగులతో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. విద్యుత్ ప్రమాదాలతో ప్రజలు, రైతులు, మూగ జీవాల ప్రాణాలు గాల్లో కలిసిపోయే అవకాశముంది. గాలివానకు విద్యుత్ స్తంభాలు విరిగిపడడం, విద్యుత్ వైర్లు తెగిపడడం, తీగలు కిందకు వాలిపోవడంతో విద్యుత్ ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ప్రమాదాల నివారణకు తగు జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ శాఖ అధికారులు తెలుపుతున్నారు. రైతులు ఇప్పటికే జోరుగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వ్యవసాయ బావుల మోటార్లు, స్టార్టర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. శిధిలావస్థలో ఉన్న భవనాలు కూలిపోయే అవకాశం ఉన్నట్లయితే ఆ వైపుకు అస్సలు వెళ్లవద్దు. వర్షాల సమయంలో భవన నిర్మాణ పనులు, గోడల పనులు నిలిపివేయాలి. పనిచేసే కార్మికులు నిర్మాణ స్థలం నుంచి వర్షానికి దూరంగా వెళ్లాలి సెల్లార్లు అస్సలు తవ్వొద్దు చెట్ల కింద నిలువ వద్దు. పలు జాగ్రత్తలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి రక్షించుకోవచ్చున్నారు. ఏదైనా విద్యుత్ ప్రమాదం సంభవించినట్లయితే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించవలసిందిగా అధికారులు సూచిస్తున్నారు.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్తాన్‌లో బహుమతి దక్కుతుంది..



**న్యూఢిల్లీ,:** పాకిస్తాన్ తీరును మరోసారి కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా విమర్శించారు. "ఆపరేషన్ సిందూర్" గురించి విదేశాలకు వివరించే భారత దౌత్య బృందానికి థరూర్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ బృందం అమెరికా డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ క్రిస్టోఫర్ లాండౌతో సమావేశమైంది. అల్-ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ను గుర్తించి, నిర్మూలించడానికి అమెరికాకు సహాయం చేసిన వైద్యుడు డాక్టర్ షకీల్ అఫ్రిది పట్ల పాకిస్తాన్ వ్యవహరించిన తీరును థరూర్ విమర్శించారు. యూఎస్ కాంగ్రెస్ సభ్యుడు బ్రాడ్ షెర్‌మెన్ సోషల్ మీడియాకు ప్రతిస్పందనంగా థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. డాక్టర్ అఫ్రిది విడుదల కోసం ఒత్తిడి తీసుకురావాలని అమెరికాలో ఉన్న పాకిస్తాన్ డెలిగేషన్‌ని షెర్‌మెన్ కోరారు. థరూర్ స్పందిస్తూ.. "పాకిస్తాన్ ఉగ్రవాద సూత్రధారి ఒసామా బిన్ లాడెన్‌కు (కంటోన్మెంట్ నగరంలోని ఆర్మీ క్యాంప్ సమీపంలోని సురక్షితమైన ఇంట్లో!) ఆశ్రయం కల్పించడమే కాకుండా, అమెరికన్లకు అతని స్థానాన్ని తెలిపిన ధైర్యవంతుడైన వైద్యుడిని అరెస్టు చేసి శిక్షించిన దేశం అని బ్రాడ్ షెర్మన్ గుర్తు చేశారు. పాకిస్తాన్‌లో మీరు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించినందుకు ప్రతిఫలం పొందుతారు, ఉగ్రవాదులను బహిర్గతం చేసినందుకు హింసించబడతారు!" అని అన్నారు. డాక్టర్ షకీల్ అఫ్రిది అల్ ఖైదా నాయకుడు ఒసామా బిన్ లాడెన్‌ని అమెరికా వేటాడటంలో అమెరికాకు సహకరించారు. పాకిస్తాన్ ఖైబర్ ఫఖ్తుంఖ్వా ప్రావిన్సుకు చెందిన ఆరోగ్య అధికారి అయిన అఫ్రిదిని 2008లో పాకిస్తాన్ ఉగ్రవాద సంస్థ లష్కరే ఇస్లాం కమాండర్ మంగళ్ బాగ్ అపరిచాడు.

# తెలంగాణలో ముగ్గురు కొత్త మంత్రులుగా ప్రమాణం

మంత్రి పదవి దక్కించుకున్న వివేక్, శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్

సామాజిక సమీకరణాల ఆధారంగా మంత్రి పదవులు

మరో మూడు మంత్రి పదవులు ఖాళీ

ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదే మంత్రిగా ప్రమోషన్




ప్రభాత సూర్య -తెలంగాణ బ్యూరో : తెలంగాణ కొత్త మంత్రులు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి రాజ్‌భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వారిచేత ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. వీరితో పాటు శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా రామచంద్రునాయక్‌ను ఎంపిక చేసింది. మంత్రులుగా ప్రమాణం స్వీకారం చేసిన వివేక్, అడ్లూ లక్ష్మణ్, వాకిటి శ్రీహరిలకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.మంత్రివర్గంలో తాజాగా ముగ్గురు చేరడంతో...మంత్రుల సంఖ్యలో 15కు చేరింది. మరో మూడు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదే మంత్రి అయ్యారు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి. శ్రీహరి ఫస్ట్? క్లాస్? నుంచి టెన్త్? వరకు మక్తల్? గవర్నమెంట్? స్కూల్?లో, ఇంటర్?, డిగ్రీ పాలమూరులో పూర్తి చేశారు. మొదట 1990 నుంచి 93 వరకు మక్తల్? మండల ఎన్ఎస్ యూఐ ప్రెసిడెంట్?గా పనిచేశారు. 1993 నుంచి 96 వరకు మక్తల్? మండల యూత్? కాంగ్రెస్? ప్రెసిడెంట్?గా విధులు నిర్వర్తించారు. 1996 నుంచి 2001 వరకు మక్తల్? మండల సెక్రటరీగా, 2001 నుంచి 06 వరకు మహబూబ్?నగర్? జిల్లా కాంగ్రెస్? పార్టీ వైస్? ప్రెసిడెంట్?గా పనిచేశారు. 2001లో మక్తల్? మేజర్? గ్రామ పంచాయతీ నుంచి భారీ మెజార్టీతో మొదటిసారి సర్పంచ్?గా ఎన్నికయ్యారు. 2006లో దాసర్?పల్లి ఎంపీటీసీగా పోటీ చేసి గెలుపొందారు.2010 నుంచి 2014 వరకున జడ్పీటీసీగా పనిచేశారు. 2018 వరకు జడ్పీ ఫ్లోర్? లీడర్?గా పని చేశారు. 2022 నుంచి 2024 ఫిబ్రవరి వరకు నారాయణపేట డీసీసీ ప్రెసిడెంట్?గా బాధ్యతలు నిర్వర్తించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్? సెగ్మెంట్? నుంచి శ్రీహరి పోటీ చేశారు. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఏడాదిలోనే ఆయనను మంత్రి పదవి వరించింది. డాక్టర్ చదివి రాజకీయాల్లోకి వచ్చిన చెన్నూర్? ఎమ్మెల్యే గడ్డం వివేక్? వెంకట్?స్వామిని ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారి మంత్రి పదవి వరించింది. ప్రముఖ కాంగ్రెస్?నేత, మాజీ ఎంపీ గడ్డం వెంకటస్వామి చిన్న కొడుకు వివేక్ వెంకటస్వామి..ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్? చదివారు.తండ్రి గడ్డం వెంకటస్వామి బాటలో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన..2009లో పెద్దపల్లి లోక్?సభ స్థానం నుంచి కాంగ్రెస్ ఎంపీగా గెలుపొందారు. 2017లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్?గా వివేక్? ఎన్నికయ్యారు. 2019లో బీజేపీలో చేరిన వివేక్?వెంకటస్వామిని పార్టీ అధిష్టానం జాతీయ కార్యవర్గంలోకి తీసుకుంది. 2023 నవంబర్ 21 న బీజేపీని వీడి కాంగ్రెస్?లో చేరిన వివేక్?వెంకటస్వామి.. చెన్నూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. ధర్మపురి శాసనసభ నియోజకవర్గం నుంచి లక్ష్మణ్ కుమార్ తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009-2011 మధ్య కాలంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ అధ్యక్షుడిగా, జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆయన పని చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌పై 22,039 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ప్రభుత్వ విప్‌గా నియమితులయ్యారు. తాజాగా.. మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ డిప్యూటీ స్పీకర్ గా పదోన్నతి పొందారు. 2006లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయాల్లో ఎంట్రీ ఇచ్చిన ఆయన..2014లో డోర్నకల్ నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి రెడ్యా నాయక్ పై భారీ మెజారిటీతో గెలుపొందారు.




# మంత్రి పదవి దక్కలేదని అలిగిన నేతలు

బుజ్జగింపులకు దిగిన కాంగ్రెస్ నేతలు

పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్న సుదర్శన్ రెడ్డి

మంత్రి పదవి దక్కించుకున్న ముగ్గురు నేతలు



ప్రభాత సూర్య- తెలంగాణ బ్యూరో : తెలంగాణలో ఊరించిన మంత్రివర్గ విస్తరణ జరిగిపోయింది. మొత్తం ఆరు పదవులు ఖాళీ ఉండగా...మూడు మాత్రమే భర్తీ అయ్యాయి. మిగిలిన మూడు త్వరలో భర్తీ చేస్తామని కాంగ్రెస్ చెప్తోంది. ఐతే ముగ్గురు మంత్రి పదవి దక్కించుకున్నారు సరే...మరి పదవులు దక్కని వారి పరిస్థితి ఏంటి? వారిని కాంగ్రెస్ శాంతింపజేసే ప్రయత్నం చేస్తోంది. చాలా మంది నేతలు గంపెడు ఆశలతో మంత్రి పదవి కోసం వేచి చూశారు. వారిలో అందరికీ న్యాయం జరగపోయినా...ముగ్గురికి అనుకున్నట్టుగానే మంత్రి పదవి దక్కింది. మరో నేతకు అనూహ్యంగా కీలక పదవి ఇచ్చింది. ఎమ్మెల్యేలు వివేక్ వెంకట స్వామి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఐతే మంత్రి పదవి దక్కని మల్ రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, రాజగోపాల్ రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు పార్టీపై అసహనంగా ఉన్నారు. తమకు మంత్రి పదవి కావాలని బహిరంగంగా కోరినప్పటికీ అధిష్టానం వారికి మొండి చేయి చూపింది. మంత్రి పదవి రాకపోవడంతో అలకబూనిన నేతలు...ఏ నిర్ణయం తీసుకుంటారోనని ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో పార్టీ నేతలు వారిని బుజ్జగించే ప్రయత్నాలు మొదలు పెట్టారు. మంత్రి వర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చిన ప్రతీసారి కాంగ్రెస్ సీనియర్ నేత సుదర్శన్ రెడ్డి పేరు చర్చకు వచ్చింది. ఆయనకు మంత్రి పదవి ఖాయం అని అనుకున్నారు. కానీ చివరికి పదవి చేజారిపోయింది. దీంతో అలిగిన ఆయనను ఏఐసీసీ వ్యవహారాల ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ కలిసి చర్చలు జరిపారు. వారిని బుజ్జగించారు. దీంతో అలక వీడిన సుదర్శన్ రెడ్డి పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానన్నారు. ఇక మల్ రెడ్డి రంగారెడ్డితోనూ నేతలు చర్చలు జరిపారు. మంత్రి వర్గ విస్తరణ తర్వాత మీడియా సమావేశం నిర్వహించాలనుకోగా...నేతల చర్చలతో ఆపేశారు. అలాగే రాజగోపాల్ రెడ్డితో కూడా మీనాక్షి నటరాజన్ భేటీ, మంత్రి వివేక్ అయ్యారు. అలాగే ప్రేమ్ సాగర్ రావుతోనూ చర్చలు జరిపారు. దీంతో వారిని బుజ్జగించి...రానున్న రోజుల్లో అవకాశం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఐతే ఇప్పటికీ వీరంతా అలక వీడినప్పటికీ...రానున్న రోజుల్లో ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనని చర్చ జరుగుతోంది.

# ఆస్తమా రోగులకు చేప ప్రసాదం ఓ వరం : మంత్రి పొన్నం

అబిడ్స్, న్యూస్‌టుడే: మృగశిర కార్తె ప్రారంభం రోజున చేప ప్రసాదం తీసుకోవడంతో ఉబ్బసం వ్యాధి నుంచి ఉపశమనం పొందొచ్చని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేరొన్నారు. బత్తిని కుటుంబానికి పద్మశ్రీ అందజేయాల్సిందిగా తెలంగాణ సర్కారు తరఫున సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఆదివారం ఉదయం చేప ప్రసాదం పంపిణీని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మధుయాస్కీ గౌడ్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఆస్తమాతో ఇబ్బంది పడుతున్న వారికి చేప ప్రసాదం ఒక వరమని పేర్కొన్నారు. ఇంతటి బృహత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న బత్తిని కుటుంబానికి అన్ని రకాలుగా ప్రభుత్వం తరఫున సహాయ, సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మత్స్య సమాఖ్య ఛైర్మన్ మెట్టు సాయికుమార్, మత్స్యశాఖ కమిషనరు ప్రియాంక, ఆర్డీవో సాయిరాం, కర్ణాటక ఎమ్మెల్సీ మంజుల బండారి, జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వృద్ధుడి మృతి

చేప ప్రసాదానికి వచ్చిన ఓ వృద్ధుడు ప్రసాదం తీసుకోకుండానే గుండె పోటుకు గురై మృతి చెందారు. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు



చెందిన సత్యనారాయణ(75) ఆదివారం చేప ప్రసాదం కోసం ఇక్కడికి వచ్చారు. మధ్యాహ్న సమయంలో సొమ్మసిల్లి పడిపోయిన ఆయనను ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో గుండెపోటుతో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

## మణిపూర్‌లో మరోసారి చెలరేగిన హింస.. ఆ జిల్లాలో కర్ఫ్యూ..

**న్యూఢిల్లీ,:** మణిపూర్‌లో మరోసారి హింస చెలరేగింది. శనివారం అనేక జిల్లాల్లో హింస చెలరేగింది. దీంతో బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ విధించారు. ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్‌ను నిషేధించారు. శనివారం రాత్రి మెయిటీ సంస్థ నాయకుడు అరంబై టెంగోల్, అనేక మంది ఇతర నాయకులను పోలీసులు అరెస్టు చేసిన తర్వాత హింస చెలరేగింది. నిరసనకారులు వీధుల్లోకి వచ్చి బస్సులు, వాహనాలకు నిప్పు పెట్టారు. ఆస్తులను ధ్వంసం చేశారు. ఆ తర్వాత హింసాత్మక ఘర్షణలు ప్రారంభమయ్యాయి. నిరసనకారులు తమపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని ప్రభుత్వాన్ని బెదిరించారు. దీనికి సంబంధించిన వీడియో కూడా బయటకు వచ్చింది. దీనిలో చాలా మంది నిరసనకారులు నిలబడి ఒంటిపై పెట్రోల్ పోసుకుంటున్నట్లు వీడియోలో ఉంది. అరంబాయి టెంగోల్ అరెస్టు తర్వాత.. శనివారం రాత్రి ఇంఫాల్ తూర్పు, పశ్చిమ జిల్లాల్లో కూడా భారీ నిరసనలు చెలరేగాయి. రాజధాని ఇంఫాల్‌లోని అనేక ప్రాంతాల్లో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణలు జరిగాయి. ఇంఫాల్‌లోని ఖురాయ్ లామ్‌లాంగ్ ప్రాంతంలో, కోపంతో ఉన్న నిరసనకారులు బస్సులను తగలబెట్టారు. టైర్లు తగలబెట్టి రోడ్లను దిగ్బంధించారు. భద్రతా దళాలతో ఘర్షణకు దిగారు. నిరసనకారులు ఇక్కడితో ఆగలేదు. ఇంఫాల్ విమానాశ్రయంలోని తులిహాల్ గేటు వెలుపల గుమిగూడారు. ఆందోళనకారులు రాత్రిపూట విమానాశ్రయ రోడ్డులో ట్రాఫిక్‌ను అడ్డుకుని, రాత్రంతా అక్కడే నిద్రపోయారు.రాజధానిలో పెరుగుతున్న హింసను చూసి పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించారు. లాఠీ ఛార్జ్‌లో ఓ వ్యక్తి మరణించినట్లు సమాచారం.

## తొక్కిసలాట ఘటనలో సంచలన విషయాలు..

## ముందే ప్రభుత్వానికి లేఖ రాసిన డీసీపీ..!

**న్యూఢిల్లీ,:** బెంగళూరు తొక్కిసలాట ఘటనలో 11 మంది మరణించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈ అంశంపై సంచలన విషయాలు బయటకు వచ్చాయి. తాజాగా విధానసౌధ భద్రతా విభాగం డీసీపీ ఎం.ఎన్. కరిబసవనగౌడ రాసిన లేఖ బయటపడింది. అందులో కర్ణాటక సిద్ధరామయ్య ప్రభుత్వాన్ని ముందే హెచ్చరించినట్లు తేలసంది. జూన్ 4న, డీసీపీ కర్ణాటక ప్రభుత్వానికి లేఖ రాశారు. "ఆర్సీబీకి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభిమానులు ఉన్నారు. లక్షలాది మంది వేడుకకు రావొచ్చు. భద్రతా సిబ్బంది కొరత ఉంది. అభిమానుల భారీగా తరలి వస్తే అనుకోని ఘటనలు జరగవచ్చు. ప్రజా ప్రవేశ పాస్‌లను రద్దు చేయాలి. విధానసౌధ ప్రాంగణంలో సీసీటీవీ నిఘా అసంపూర్ణంగా ఉంది. దీనివల్ల భద్రతా సమస్యలు తలెత్తవచ్చు." అని ముందుగానే పరిపాలనా సంస్కరణల శాఖ కార్యదర్శి జి. సత్యవతికి రాసిన లేఖలో హెచ్చరంచారు. పీడబ్ల్యుడీ రెండు గంటల ముందుగానే వేదికను తనిఖీ చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరి అని డీసీపీ పేర్కొన్నారు. విద్యుత్ పరికరాలకు ప్రత్యేక ఫిట్‌నెస్ సర్టిఫికేట్ గురించి కూడా ప్రస్తావించారు. ట్రాఫిక్, శాంతిభద్రతల మధ్య సమన్వయం లోపాన్ని డీసీపీ లేఖలో ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. ఇతర జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను పిలిపించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. డీసీపీ లేఖ రాసినప్పటికీ.. ప్రభుత్వం దానిని పట్టించుకోలేదు.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com


## రాజ్యసభకు నామినేషన్ సమర్పించిన కమల్‌హాసన్



చెన్నై : మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) అధ్యక్షులు, నటుడు కమల్‌హాసన్ శుక్రవారం రాజ్యసభకు నామినేషన్ సమర్పించారు. రాష్ట్రముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్‌ల సమక్షంలో చెన్నైలోని సచివాలయంలో ఆయన నామినేషన్ పత్రాలు సమర్పించారు. డిఎంకె మిత్రపక్షాలైన విసికె నేత తిరుమావలవన్, ఎండిఎంకె లీడర్ వైకో, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షులు సెల్వ పెరుందగైలు కూడా హాజరయ్యారు. డిఎంకెతో కుదిరిన ఒప్పందం ప్రకారం పార్లమెంట్ ఎగువ సభకు ఎంఎన్ఎంకి కేటాయించిన సంగతి తెలిసిందే. కమల్‌హాసన్‌తో పాటు మరో ముగ్గురు డిఎంకె అభ్యర్థులు సల్మా, అడ్వకేట్ పి.విల్సన్, ఎస్.ఆర్.శివలింగంలు కూడా నామినేషన్లు సమర్పించారు. జూన్ 19న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. 234మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో, ప్రతి అభ్యర్థికి రాజ్యసభ సీటు కోసం కనీసం 34 ఓట్లు అవసరం. 158మంది ఎమ్మెల్యేలతో (డిఎంకె133, కాంగ్రెస్ 17,విసికె4, సిపిఐ(యం) 2, సిపిఐ 2) డిఎంకె నేతృత్వంలోని ఇండియా బ్లాక్ నాలుగు సీట్లను సులభంగా గెలుచుకునే అవకాశం ఉంది.

## మీ హయాంలో మీ నాయకుడి సినిమానే వాయిదా వేసుకునే పరిస్థితి..




**అమరావతి,:** ఎన్నికల ముందు 143 వాగ్దానాలతో పాటు ఈవీఎంలను లోబర్చుకుని చంద్రబాబు గెలిచారని, గెలిచి ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్నారని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్ర శేఖర్ ఆరోపించారు. శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వెన్నుపోటు దినం రోజు పెద్ద ఎత్తున ప్రజలు రోడ్డు పైకి వచ్చారని చెప్పారు. ప్రతి కార్యక్రమంలో జగన్‌ని నిందిస్తున్నారని.. అవాకులు చెవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని.. దిగజారుడు మాటలు మాట్లాడటానికి సిగ్గు అనిపించడం లేదా? అని ప్రశ్నించారు. దళితులకు ఈ రాష్ట్రంలో అవమానం జరుగుతుందని ఆరోపించారు. రాష్ట్రంలో గంజాయి వ్యాపారం చేస్తుంది టీడీపీ వాళ్లే అని గంటా శ్రీనివాసరావు మాట్లాడుతున్నారన్నారు.. హెూం మంత్రి అనితకు కులం కోటా లోనే మంత్రి పదవి వచ్చిందని విమర్శించారు. దళితులను కొడితే హెూం మంత్రి కేర్ లెస్ గా మాట్లాడుతున్నారన్నారు.. పరిటాల సునీత ఇలాకాలో దళిత బాలిక పై నెలల తరబడి అత్యాచారం చేశారని గుర్తు చేశారు. ఈ ఘటన మీకు కనపడటం లేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ ఉందా? అని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్ర శేఖర్ ప్రశ్నించారు. "ఇచ్చిన హామీలను అమలు చేయని మీరు వెన్నుపోటు దారులు కాదా? విద్యార్థులు, మహిళలు, తల్లులను మోసం చేసింది మీరు కాదా? రైతులను మోసం చేసింది నిజం కాదా? మీ నాయకుడు కూడా సినిమా వాయిదా వేసుకునే పరిస్థితి ఏర్పడింది.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శాఖలో ఒక్కరికి ఉద్యోగం ఇప్పించారా? పవన్ కళ్యాణ్ అన్న నాగబాబు కి ఉద్యోగం ఇప్పించారు. పంచాయతీ రాజ్ శాఖని నిర్వీర్యం చేస్తున్నారు." అని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు.

## ప్రశ్నార్థకంగా మావోయిస్టుల భవితవ్యం..!



**న్యూఢిల్లీ,:** మావోయిస్టు పార్టీ నానాటికి ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది ..పార్టీ అగ్ర నాయకులను కోల్పోతుంది.. పార్టీ కేంద్ర నాయకత్వం పట్టు తప్పు పోతుంది.. పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్కొంటర్లో చనిపోగా ఇప్పుడు కిందిస్థాయి వాళ్లు కూడా ఎన్కొంటర్లో చనిపోతున్నారు.. బతికున్న వాళ్లు చాలామంది లొంగిపోతున్నారు. మావోయిస్టు పార్టీ ఏర్పడిన వారు 44 మందితో కేంద్ర కమిటీ ఏర్పాటు అయింది ఇప్పుడు ఆ సంఖ్య 16కు తగ్గిపోయింది ఇందులో ఉన్నవాళ్లు చాలామంది ఎన్కొంటర్లో చనిపోగా కొందరు వృద్ధాప్యంతో మృతిచెందారు.. ఆపరేషన్ కగార్ మొదలుపెట్టిన తర్వాత మావోయిస్టులకు ఊహించని విధంగా దెబ్బ తలుగుతుంది.. మావోయిస్టు కేంద్ర కమిటీల సభ్యులను టార్గెట్టుగా చేసుకుని భద్రత బలగాలు కూబింగ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నాయి. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు తో పాటు 26 మంది మృతి చెందిన ఘటన మరిచిపోక ముందే మరొక అగ్ర నాయకుడిని మావోయిస్టు పార్టీ కోల్పోయింది ..చర్చల సందర్భంగా కీలక పాత్ర పోషించిన సుధాకర్ అలియాస్ సింహాచలంని బీజాపూర్ లోని నేషనల్ పార్క్ అడవుల్లో మృతి చెందారు ..బీజాపూర్ లోని నేషనల్ పార్క్ సమీపంలో జరిగిన ఎన్కొంటర్లో సుధాకర్ మరణించినట్లు భద్రత బలగాలు పేర్కొన్నాయి ..అయితే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుల టార్గెట్ గానే ఈ కోబింగ్ ఆపరేషన్ చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు ..మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు అయిన గణేష్ తో పాటు సుధాకర్ మరికొంతమంది కీలక సభ్యులు సమావేశం అయ్యారని సమాచారంతో నేషనల్ పార్క్ నుంచి కూలింగ్ ఆపరేషన్ మొదలుపెట్టారు ..ఈ ఆపరేషన్ పూర్తి అయ్యేసరికి సుధాకర్ చనిపోయినట్లు అధికారులు వెల్లడించారు.. అయితే మిగతా వాళ్ళు ఈ సంఘటన స్థలం నుంచి పారిపోయి ఉంటారని అధికారులు చెప్తున్నారు.. బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన నర్సింహాచలం అలియాస్ సుధాకర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ నలుగురు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నారు. 2004లో నాటి పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కలిసి మావోయిస్టు పార్టీగా ఏర్పడినపుడు 42 మందితో కేంద్రకమిటీ ఏర్పాటైంది. ఈ 21 ఏళ్లలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, సహజమరణాలతో కేంద్ర కమిటీలోని సభ్యుల సంఖ్య 16కి తగ్గిపోయింది. జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. అబూజ్‌మడ్ వంటి కంచుకోటలను ఏర్పాటు చేసుకుని నాయకులను, క్యాడర్‌ను కాపాడుకుంది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌తో ఆ పార్టీ శ్రేణులు చెల్లాచెదరయ్యారు. వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాది జనవరిలో ఛత్తీసగఢ్, ఓడిశా సరిహద్దుల్లోని కుల్హాడీఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడైన రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం, అలియాస్ చలపతి మరణించారు. ఆ తర్వాత మే నెలలో బీజాపూర్ జిల్లా ఉసూర్ సమీపంలోని లంకపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మరణించారు. అదే నెలలో నారాయణపూర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఎన్‌కౌంటర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి మరణించటం ఇదే ప్రథమం. తాజాగా గురువారం బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏపీకి చెందిన తెంటు నర్సింహాచలం అలియాస్ సుధాకర్ చనిపోయారు. వైయస్సార్ ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో సుధాకర్ రామకృష్ణ గణేష్ కీలకపాత్రలు పోషించారు.. ఈ విధంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు. కేంద్ర కమిటీలో ప్రస్తుతం 16 మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఏపీ, తెలంగాణకు చెందిన వారు 11 మంది ఉన్నారు.., జార?ండ్‌కు చెందినవారు ముగ్గురు, ఛత్తీసగఢ్‌కు చెందిన వారు ఇద్దరున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన వారు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోనూ, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మోడెం బాలకృష్ణ, పాక హన్మంతు అలియాస్ ఊకే గణేష్, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, గాజర్ల రవి అలియాస్ ఉదయ్, పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్, పోతుల కల్పన. జార?ండ్‌కు చెందిన వారు మిసిర్ బెస్రా అలియాస్ సునీల్, అనల్ దా అలియాస్ పాతిరాం మాంజీ, సహదేవ్ అలియాస్ అనూజ్. ఛత్తీసగఢ్‌కు చెందిన వారు మాజ్జీదేవ్ అలియాస్ రాంధీర్, మాడ్వి హిడ్మా. వీరిలో 60 ఏళ్లకు పైబడినవారే ఉన్నారు.. ఇందులో చాలామంది కూడా వృద్ధా సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. చాలామంది దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్నారు ఇందులో చాలామంది నడవలేని స్థితిలో కూడా ఉన్నారు.. కేశవరావు చనిపోవడంతో ఆ స్థానంలో ఎవరిని కేంద్ర కమిటీ నియమిస్తుందనే దానిమీద ఒక ఉత్కంఠ నెలకొంది. ఇందులో తెలుగు వాళ్ళకే మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పదవి వస్తుందని అందరూ అనుకుంటున్నారు. దీనికి సంబంధించి అటు నిఘా వర్గాలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి ..కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి ఎవరు అనేదానిమీద ఇప్పుడు చర్చ నడుస్తుంది.

# రష్యాకు తత్వం బోధపడాలి!



శాంతి సాధన కోసం తుర్కియేలో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య చర్చలకు 24 గంటల ముందు 'ఆపరేషన్ స్పైడర్స్ వెబ్' పేరిట ఉక్రెయిన్ ప్రయోగించిన వందలాది డ్రోన్లు ఆదివారం రష్యా సైనిక స్థావరాలు అయిదింటిలో భారీ విధ్వంసం సృష్టించగలిగాయి. మరోవైపు రష్యా అంతకుముందూ, ఆ తర్వాతా ఉక్రెయిన్ నగరాలపై బాంబుల వర్షం కురిపించింది. ఇలా పరస్పర దాడుల నేపథ్యంలో సోమవారం జరిగిన చర్చలు సహజంగానే గంటన్నరలో ముగిశాయి. కరచాలనాలు లేకుండా, కాల్పుల విరమణ ఊసెత్తకుండా యుద్ధఖైదీల మార్పిడిపై ఒప్పందం కుదుర్చుకుని రెండు బృందాలూ నిష్క్రమించాయి. అయిదు స్థావరాలపై ఉక్రెయిన్ దాడులకు ప్రయత్నించిన మాట వాస్తవమే అయినా మూడు చోట్ల దాడుల్ని నిరోధించగలిగామని రష్యా చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా తమ డ్రోన్లు రష్యాలోని 41 బాంబర్ విమానాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ వివరిస్తోంది. దానికి వేలకోట్ల నష్టం వాటిల్లిందని చెబుతోంది. రష్యా దాడుల పర్యవసానంగా ఈ మూడేళ్ల కాలంలో ఉక్రెయిన్ సైన్యం వేలాదిమందిని కోల్పోయింది. ఇలాంటి నష్టాలను పెద్ద దేశం కనుక రష్యా భర్తీ చేసుకోగలుగుతోంది. అందుకే నల్లసముద్రంలో రష్యా దూకుడును తగ్గించేందుకు ఉక్రెయిన్ పూర్తిస్థాయిలో డ్రోన్‌లను నమ్ముకున్నట్టు కనబడుతోంది. యుద్ధం మొదలైన తొమ్మిది నెలల తర్వాత ఉక్రెయిన్ తొలిసారి 2022 డిసెంబర్‌లో రష్యా భూభాగంలో దాడులు మొదలు పెట్టింది. ఈ మూడేళ్ల కాలంలో తన స్థావరాలు, ఇంధన డిపోలు, యుద్ధ విమానాల గోడౌన్లు పటిష్టం చేసుకోవటంలో రష్యా శ్రద్ధ పెట్టిన మాట నిజమే అయినా ఉక్రెయిన్ సైతం డ్రోన్ల వినియోగంలో తన సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే పనిలోబడింది. ఆ విషయంలో అది విజయవంతమైందని ఆదివారంనాటి దాడులు వెల్లడిస్తున్నాయి. ప్రత్యర్థి దేశం తమతో పోలిస్తే పిపీలకమని, తమది అగ్రరాజ్యం, సంపన్న దేశమని మిడిసిపడే పరిస్థితి వర్తమాన కాలంలో ఎవరికీ లేదని ఉక్రెయిన్ దాడి వెల్లడిస్తోంది. యుద్ధం తప్పనిసరైనప్పుడు అందుకు అనుగుణంగా లోతైన అధ్యయనం చేసి, ఎప్పటికప్పుడు తనను తాను తీర్చిదిద్దుకున్న పక్షమే దీటుగా నిలబడగలుగుతుంది. ఉక్రెయిన్ ఆ పని చేయగలిగిందని ఈ ఉదంతం నిరూపిస్తోంది. యుద్ధం ప్రారంభించిందీ, దాన్ని వద్దు వద్దని ఎంతమంది చెబుతున్నా వినకుండా కొనసాగిస్తున్నదీ రష్యాయే గనుక అది ప్రస్తుత నష్టానికి తనను తానే నిందించుకోవాలి. చర్చలు ప్రారంభమయ్యాకైనా గౌరవప్రదంగా కాల్పుల విరమణకు సిద్ధమై తన డిమాండ్లేమిటో చెబితే వాటిపై ఉక్రెయిన్ వైఖరేమిటో తేటతెల్లమయ్యేది. చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడినా, నిలిచిపోయిన యుద్ధాన్ని తిరిగి కొనసాగనీయరాదన్న ఆత్రుత అందరిలో వుండేది. అందువల్ల కొంత రాజీకి ఉక్రెయిన్‌ను ఒప్పించటానికి కూడా ప్రయత్నాలు సాగేవి. కానీ చర్చలకు ఒప్పుకున్నాక కాల్పుల విరమణ ఇంకా ఉనికిలోకి రాలేదన్న ఏకైక కారణంతో అది దాడుల్ని కొనసాగించింది. రష్యా దురాక్రమించిన భూభాగమంతా వెనక్కిస్తే తప్ప యుద్ధ విరమణ ఉండబోదని మొన్న జనవరి నెలాఖరున ఉక్రెయిన్ చెప్పటంతో ఆగ్రహించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆ దేశానికి ఇకపై అమెరికా నిఘా సమాచారం అందబోదని ప్రకటించారు. తాజా దాడులు గమనిస్తే ఉక్రెయిన్ ఆ అవరోధాన్ని కూడా అధిగమించగలిగిందని అర్థమవుతుంది. పైగా రష్యా గడ్డపైకి ట్రక్కుల్లో డ్రోన్లు తీసుకెళ్లి, లక్ష్యాలను చేరుకోగానే అవి ఒక్కసారిగా ఎగిరి యుద్ధ విమానాలను ధ్వంసం చేసేలా పథకం రచించింది. ఈ పరిణామానికి రష్యా ఎటూ ఆందోళన పడుతుంది. కానీ పాశ్చాత్య దేశాలు సైతం కంగారు పడక తప్పదు. ఎందుకంటే ఎవరి నిఘా సాయమూ లేకుండా చవగ్గా లభించే డ్రోన్లతో రష్యావంటి దేశంలో పెనువిధ్వంసం సృష్టించగలగటం మాటలు కాదు. తమ పొరుగునేవుండి, తమ ప్రోత్సాహంతో రష్యాను చీకాకు పర్చటానికి ముందుకొచ్చిన చిన్న దేశం సైనికంగా ఇంత పటిష్టం కావటం పాశ్చాత్య దేశాలు జీర్ణించుకోలేనిది. 2014 మొదట్లో ఉక్రెయిన్ అధ్యక్షుడిగా వుండిన విక్టర్ యెనుకోవిచ్ తమ కీలుబొమ్మ కాలేదని అతన్ని కుట్రపూరితంగా పడగొట్టి జెలెన్‌స్కీని ప్రతిష్టించింది పాశ్చాత్య దేశాలే. అందుకు అమెరికా సైతం దన్నుగా నిలబడింది. నాటోను తూర్పువైపు విస్తరించాలన్న ఆ దేశాల దురాలోచనే ఇందుకు కారణమని గ్రహించిన రష్యా అధ్యక్షుడు పుతిన్ 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్ దురాక్రమణకు తెరతీశారు. డ్రోన్ దాడుల్లో రష్యా కోల్పోయిన యుద్ధ విమానాలు టియూ-95, టియూ-160 విమానాలు. అవి క్రూయిజ్ క్షిపణుల్ని ప్రయోగించగల సామర్థ్యం వున్నవి. ఉక్రెయిన్ చెబుతున్నదే నిజమైతే రష్యా వైమానిక పాటవం 34 శాతం కోల్పోయిందని సైనిక నిపుణుల అంచనా.

వీటిని తిరిగి సమకూర్చుకోవాలంటే వేలాది కోట్ల రూబుళ్ల వ్యయమవుతుంది. రష్యాకు తత్వం బోధపడినట్టేనా? తమ దాడులతోపాటు పాశ్చాత్య దేశాలు రష్యాపై ఆంక్షల తీవ్రతను పెంచాలన్నది జెలెన్‌స్కీ వాదన. కానీ అమెరికా కనుసన్నల్లో నడిచే ఆ దేశాలు అందుకు సిద్ధపడలేవు. యుద్ధాన్ని ప్రారంభించటం సులభమే, కొనసాగించటమూ పెద్ద కష్టం కాదు. కానీ ముగించటం అత్యంత క్లిష్టమైనది. ఇరుపక్షాలకూ అప్పటికే యుద్ధం ప్రతిష్టాత్మకంగా మారిపోతుంది. విరమణకు సిద్ధపడితే దేశాన్ని పాదాక్రాంతం చేశారన్న అపఖ్యాతి వస్తుంది. అలాంటి అవమానాన్ని దిగమింగటానికి జెలెన్‌స్కీ సిద్ధంగా వున్నా పుతిన్ ససేమిరా అనటమే ప్రస్తుత సమస్య. ఇప్పటికే ఎంతో జాప్యం జరిగింది. కనుక ఈ యుద్ధం ఆపటానికి ప్రపంచ దేశాలు ప్రయత్నించాలి. తగిన హామీలిచ్చి పుతిన్‌ను ఒప్పించాలి.

# వైపరీత్యాల సుడిలో ఈశాన్య రాష్ట్రాలు



సాధారణంగా జూన్ 1 నాటికి కేరళలో నైరుతి పవనాలు ప్రవేశిస్తాయని, జూన్ 5 నాటికి ఈశాన్య రాష్ట్రాలకు చేరుకుంటాయని అనుకున్నారు. కానీ కేరళలో రుతుపవనాలు ముందుగానే ప్రవేశించాయి. రైతులంతా నైరుతికి స్వాగతం పలికారు. కానీ కేరళ నుంచి రుతుపవనాలు ఉధృతంగా ప్రవేశించి తదుపరి ఉత్తర దిశగా పయనించి అపార విధ్వంసాన్ని సృష్టించాయి. రుతుపవనాల్లో ఇది అరేబియా సముద్ర విభాగం. కేరళలో ప్రారంభమైన ఒకటి రెండు రోజుల తరువాత కొన్ని సార్లు ఏకకాలంలో బంగాళాఖాతం విభాగం రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల నుంచి ఈశాన్య రాష్ట్రాల్లో తరచుగా ప్రవేశించడం జరుగుతుంది. అయితే ఈ తూర్పు ప్రారంభం వరదలకు, కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతోంది. సాధారణంగా జూన్‌లో వర్షపాతం ఎక్కువగా ఉంటుందని అనుకుంటారే తప్ప వరదల బీభత్సం ముంచుకొస్తుందని అనుకోరు. వాతావరణ విభాగం కూడా సాధారణం కన్నా తక్కువగానే వర్షపాతం ఈశాన్య రాష్ట్రాల్లో ఉంటుందని అంచనా వేసింది. కానీ రుతుపవనాల ప్రాథమిక స్థాయి దేశంలోని మిగతా రాష్ట్రాల కన్నా ఈశాన్య రాష్ట్రాల్లోనే ఎక్కువగా కనిపించింది. ఎందుకు ఈ విధంగా జరుగుతోంది? ఏడాది పొడుగునా నీటికి కరువై, ఒక్కసారి ఈ విధంగా కుంభవృష్టి కురుస్తుండడం ఒక సవాలుగా మారింది. అయితే అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో కూడా ఈశాన్య రాష్ట్రాల్లో చిన్నపాటి రుతుపవనాల వంటి వాతావరణం కనిపించింది. ఏడాది పొడుగునా ఈశాన్య రాష్ట్రాల దుర్బలత్వాన్ని అంచనా వేసి ఒక ప్రణాళికను రూపొందించడం అవసరం. చారిత్రకంగా దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఈశాన్య రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి అంతగా జరగలేదు. భౌగోళిక పరిస్థితులు ఒక సవాలుగా నిలవడం ఒక కారణం. బాధిత రాష్ట్రాలనన్నిటినీ కలుపుకుని కేంద్రం క్రమబద్ధమైన సమీక్ష నిర్వహించాలి. ఏటేటా వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి వైపరీత్యాలతో అపార ప్రాణనష్టం జరగకుండా, అలాగే విధ్వంసం సంభవించకుండా నివారించడానికి స్థిరమైన దీర్ఘకాలిక ప్రణాళికను రూపొందించడం తప్పనిసరి. నైరుతి పవనాల ప్రభావంతో గత వారం రోజులుగా ఈశాన్య రాష్ట్రాల్లో కుండపోతగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. సిక్కి, అసోం, మణిపూర్, అరుణాచల్‌ప్రదేశ్, త్రిపుర, మిజోరాం, నాగాలాండ్, మేఘాలయల్లో కుంభవృష్టి కారణంగా ఎక్కడికక్కడ కొండచరియలు విరిగిపడుతున్నాయి. ఇళ్లు కూలుతున్నాయి. ఈ బీభత్సానికి ఈశాన్య రాష్ట్రాల్లో దాదాపు 34 మంది ప్రాణాలు కోల్పోయారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. అసోంలో 10 ప్రధాన నదులు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. 19 జిల్లాల్లోని మూడు లక్షల మంది వరదలకు బాధితులయ్యారు. త్రిపురలో అనేక జిల్లాలు భారీ వర్షాలతో దెబ్బతింటున్నాయి. ఉత్తర సిక్కింలో కొండచరియలు విరిగిపడడంతో 1500 మంది టూరిస్టులు ఇరుక్కున్నారు. మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు ఈశాన్య రాష్ట్రాల్లో 125 మంది వరకు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. కొండచరియల ప్రమాదాలపై 2020 లో జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా అధ్యయనం నిర్వహించింది. దేశం లోని 16 రాష్ట్రాలు, హిమాలయ రీజియన్‌లోని రెండు కేంద్ర పాలిత ప్రాంతా లు, ఈశాన్యంలోని హిమాలయ పర్వత దిగువ భాగాలు, పశ్చిమ కనుమలు, ఇవన్నీ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలుగా అధ్యయనం గుర్తించింది. రోడ్లు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు, ఒక ప్రణాళిక లేకుండా సాగించే కొండ క్వారీ పనులు ఇవన్నీ కొండచరియలు విరిగిపడడానికి కారణమవుతున్నాయని అధ్యయనం హెచ్చరించింది. అలాగే కొండచరియలు విరిగిపడడానికి 51 శాతం అనువైన ప్రాంతం ఉత్తరాఖండ్ అని వాడియా ఇన్‌స్టిట్యూట్ అధ్యయనంలో తేలింది. ప్రపంచంలోనే భూకంపాలు సంభవించే ఆరో ప్రాంతంగా ఈశాన్య ప్రాంతం ఉంటోంది. ఈ ప్రాంతాల్లో ఆరు నెలలపాటు భారీగా వర్షాలు కురుస్తుంటాయి. ఈ నేపథ్యంలో కొండచరియల ముప్పు తప్పించడానికి నిర్మాణాత్మక ఇంజినీరింగ్ పనులు చేపట్టడం అవసరమని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సూచిస్తోంది. నేల స్వభావం పరిశీలించకుండా, పోడు వ్యవసాయం వంటివి నివారించకుండా కొండచరియల ముప్పును తప్పించే మార్గాలు అన్వేషించకుండా ఎలాంటి అభివృద్ధి నిర్మాణాలు చేపట్టినా, ప్రమాదమేనని భౌగోళిక సాంకేతిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. హిమాలయ పర్వత ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలతో అత్యధిక సంఖ్యలో చెట్లను కూల్చివేస్తున్నారు. 2015 నుంచి 2018 మధ్య కాలంలో 10.76 మిలియన్ చెట్లను కూల్చివేశారు. కొండలను తొలిచి సొరంగాలు నిర్మిస్తున్నారు. దీంతో నేల దృఢత్వం దెబ్బతిని కొండచరియలు విరిగిపడుతున్నాయి. ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు కొన్ని వేల మంది ప్రాణాలు మట్టిలో మట్టై పోయినప్పుడు లబోదిబోమనడం, నష్టం ఎంతవరకు జరిగిందో సమీక్షించడం తప్ప ఈ విధ్వంసానికి దారి తీసే కారణాలేమిటో, వాటిని ఎలా నివారించగలమో అన్న దిశలో ప్రభుత్వాలు ప్రయత్నించడం లేదు. ప్రకృతి పరంగా కొన్ని ప్రమాదాలు జరుగుతుండగా, మానవ బాధ్యతారాహిత్య చర్యల వల్ల అంతకన్నా ఎక్కువగానే నష్టం జరుగుతోంది. వీటిని అడ్డుకోవడానికి సరైన ప్రణాళికలు అమలు కావడం లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో పెరుగుతున్న జనాభాకు తగినట్టు మౌలిక సదుపాయాల అభివృద్ధి జరగకపోవడం ప్రధాన లోపం. సౌకర్యాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య నెలకొన్న సంక్లిష్టతపై కూడా చర్చలు జరుగుతున్నాయి. ఈ రాష్ట్రాల్లో శాస్త్రీయ విశ్లేషణ అనుసరించి నిర్మాణాలు చేపట్టడం అవసరం.

# రైలు ప్రయాణమంటే జనం బెంబేలు






రైలు ప్రయాణం అంటే ప్రజలు ఎంతో ఇష్టపడతారు. ఎక్కువ మంది ప్రయాణం చేసే ప్రయాణ సాధనంగా ఉంటుంది. చిన్న పిల్లలకు, మహిళలకు, వృద్ధులకు, వికలాంగులకు, పేదలకు, పెద్దలకు అన్ని వర్గాల ప్రజలకు సౌకర్యవంతమైన సురక్షితమైన ప్రయాణ సౌకర్యం. హైదరాబాద్ నగరంలో నాంపల్లి, కాచిగూడ, సికింద్రాబాద్ మూడు పెద్ద రైల్వేస్టేషన్లు ఉన్నాయి. ఇటీవల చర్లపల్లి రైల్వేస్టేషన్‌ను కలుపుకుంటే నాలుగు పెద్ద రైల్వే స్టేషన్‌లు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఉన్నాయని చెప్పవచ్చు. ఈ నాలుగు పెద్ద రైల్వేస్టేషన్‌ల (జంక్షన్ల) నుండి దేశంలోని వివిధ రాష్ట్రాలకు కొన్ని వేల మంది ప్రయాణికులు ప్రతి రోజూ వ్యాపార నిమిత్తం, ఉద్యోగాల నిమిత్తం, విధ్య, వైద్యం, విహార, విజ్ఞాన, వినోద తీర్థయాత్రలకు అనేక వేల మంది ప్రయాణికులు రైళ్లలో ప్రయాణం చేసి తమ గమ్యస్థానాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇటీవల రైళ్లలో ప్రయాణం అంటే భయంకరమైన అనుభవాలు ఎదురవుతున్నాయి. రైళ్ళు శుభ్రంగా ఉండడం లేవు. రైళ్ళలో నీళ్ళు రావడం లేదు. మరుగుదొడ్లు శుభ్రపరచడం లేదు. టికెట్ కౌంటర్లలో టికెట్ ఇచ్చే రైల్వే సిబ్బంది తమ ఇష్టానుసారంగా డబ్బులు తీసుకుంటున్నారు. కాచిగూడ నుండి గద్వాలకు డ్బ్బై ఐదు రూపాయల టికెట్ తీసుకోవాలి. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్ కాచిగూడ నుంచి బయలుదేరి కర్నూలుకు వెళ్తుంది. ఉభయ తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుండి వేలాది మంది ప్రతిరోజూ వేరే వేరే పనుల మీద రాకపోకలు కొనసాగిస్తున్నారు. కాచిగూడ నుండి గద్వాలకు ఒక సారి డ్బ్బైఐదు, మరోసారి తొంభై, ఇంకోసారి వంద రూపాయలు తీసుకుంటున్నారు. ఇదేమిటని అడిగిన ప్రయాణీకులమీద కస్సుబుస్సు అంటున్నారు. తుంగభద్రలో గత కొంతకాలంగా ఎప్పుడు చూసినా నీళ్ళు రావడం లేదు. రైళ్లలో దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు రిజర్వేషన్లు చేసుకుంటారు. రిజర్వేషన్‌లో లోయర్ బెర్త్, మిడిల్ బెర్త్, అప్పర్ బెర్త్ అని మూడు రకాలుగా ఉంటదనే విషయం మనందరికీ తెలిసిందే. రిజర్వేషన్ల కౌంటర్‌లలో ఉండే రైల్వే సిబ్బంది వృద్ధులకు అప్పర్ బెర్త్ కేటాయిస్తున్నారు. దీని వలన అనేక ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది. మహిళలకు ముఖ్యంగా చంటిపిల్లల తల్లులకు, వృద్ధులకు లోయర్ బెర్త్ కేటాయించాలి. కాని రైల్వే కౌంటర్లలో ఉన్న సిబ్బందికి చంటి పిల్లల తల్లులు, వృద్ధులు ఉన్నారని ఎంత బ్రతిమలాడిన మిడిల్ బెర్త్, అప్పర్ బెర్త్‌లను మాత్రమే కేటాయిస్తున్నారని ప్రయాణికులు ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. మానవత దృక్పథంతో లోయర్ బెర్త్ కేటాయించాలని ఎంత బ్రతిమలాడిన చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది. తెలంగాణలోని శక్తిపీఠమైన ఆలంపూర్ జోగులాంబ దేవాలయం ఎంతో ప్రసిద్ధి. ప్రతిరోజు ఎంతో మంది భక్తులు జోగులాంబ అమ్మవారి దేవాలయానికి వస్తుంటారు. జోగులాంబ రైల్వేస్టేషన్ పేరు లేకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. ప్రతి రైల్వేస్టేషన్‌లో ఇరువైపుల పెద్ద పెద్ద పేర్లతో కూడిన బోర్డులు కన్పిస్తాయి. జోగులాంబ రైల్వే స్టేషన్‌లో ఎక్కడా జోగులాంబ రైల్వేస్టేషన్ అనే బోర్డు కన్పించదు. జోగులంబ రైల్వేస్టేషన్ దగ్గర రైలు ఆగితే క్రాసింగ్ గురించి ఆగిందేమో అనుకుంటారు. కొద్ది దూరంలోనే ఆలంపూర్ రైల్వేస్టేషన్ ఉంది. కానీ అక్కడ రైలును ఆపరు. నేరుగా కర్నూలు రైల్వేస్టేషన్‌లోనే ఆపుతున్నారు. కర్నూల్ నుండి జోగులాంబ దేవాలయానికి ఆటోలలో లేదా కార్లలలో ప్రయాణించవలసి వస్తోంది. రైల్వే అధికారులు నిర్దిష్ట చర్యలు తీసుకొని జోగులాంబ రైల్వేస్టేషన్ బోర్డును ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రయాణీకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రైలు ప్రయాణం సురక్షితంగా, సుఖవంతంగా, ఆనందంగా ఉండేటట్లు చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు




**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్రంలో గిరిజనుల పట్ల ప్రత్యేక దృష్టితో పథకాలు అమలవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు, పేదలు నివసించే ప్రాంతాల్లో జీవనోపాధికి ఆటంకం లేకుండా జీం3 మోడల్‌లో ఇండ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా ఆదివాసీలకు నివాస హక్కు కల్పించడమే కాకుండా, వారు జీవించేందుకు అవసరమైన వనరులను అందుబాటులో ఉంచే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి. ఇక పట్టణాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు పథకం కార్యరూపం దాల్చనుంది. ఈ క్రమంలో గిరిజనులకు ప్రత్యేకంగా 22 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్టు రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో భద్రాచలం, ఉట్నూరు, ఏటూరునాగారం, మున్ననూరు ఐటిడిఎ పరిధిలోని చెంచు, కొలం, తోటి, కొండరెడ్ల గిరిజనుల కోసం 13,266 ఇండ్లను మంజూరు చేశారు. అంతేకాక, రాష్ట్రంలోని 16 ఎస్టీ నియోజకవర్గాల్లో ఇప్పటికే 8,750 ఇండ్లు మంజూరు చేసినట్టు మంత్రి తెలిపారు. మొత్తం కలిపి ఇప్పటివరకు గిరిజనులకు 22,016 ఇండ్లు మంజూరైనట్టు వెల్లడించారు. ఇందిరమ్మ హౌసింగ్ పథకం పునఃప్రారంభం ద్వారా గిరిజనులకు పెద్దఎత్తున లబ్ధి చేకూరనుంది. ఇది వారి స్థిర నివాస కలను నెరవేర్చడమే కాక, భవిష్యత్ తరాలకు బాగోతమైన భద్రతను కల్పించనున్నది.

## ఎవరెన్ని కుట్రలు చేసినా.. కాశ్మీర్ అభివృద్ధిని ఆపలేరు..




**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రవాద దాడి తర్వాత తొలిసారి కాశ్మీర్ లోయలో ప్రధాని మోడీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చినాబ్ వంతెన ప్రారంభోత్సవం జమ్మూ కాశ్మీర్ పురోగతికి ప్రతిబింబమని అన్నారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా.. కాశ్మీర్‌లో అభివృద్ధిని ఆపలేరని పేర్కొన్నారు. పహల్గాం దాడి, ఆపరేషన్ సింధూర్ గురించి ప్రస్తావిస్తూ.. ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పామని పేర్కొన్నారు. పాకిస్తాన్ పర్యాటకానికి, మానవత్వానికి వ్యతిరేకం.. మన టూరిజాన్ని దెబ్బ తీసి పేదల పొట్ట గొట్టాలని ప్రయత్నిస్తుంది.. ఆదిల్ హుస్సేన్ గుర్రం మీద పర్యాటకులను తీసుకెళ్లే పోనీ వాలా.. తన కుటుంబాన్ని పోషించేందుకు కష్టపడేవాడు.. ఆ రోజు టెర్రరిస్టులతో వీరోచితంగా పోరాడాడు.. కానీ, చివరకు అతడ్ని కూడా ఉగ్రవాదులు చంపేశారని ప్రధాని మోడీ మండిపడ్డారు. ఇక, ఉగ్రవాదంపై పోరాటంలో వెనక్కి తగ్గేది లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. కాశ్మీర్‌లో పర్యాటకాన్ని ధ్వంసం చేయాలని, దేశంలో అల్లర్లు సృష్టించాలని పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేశారు.. అమాయక ప్రజలను చంపడంతోనే.. ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్‌తో మన శక్తి ఏంటో పాకిస్తాన్ కు చూపించామని వెల్లడించారు. సరిగ్గా నెల రోజుల క్రితం పాక్ లోని ఉగ్ర స్థావరాలను నేలమట్టం చేశాం.. పురుడు దేశం నాయకత్వానికి నిద్ర లేకుండా చేశామని చెప్పుకొచ్చారు. పాకిస్తాన్ ఎన్ని కుట్రలు పన్నినా కాశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోలేదని నరేంద్ర మోడీ తెలిపారు.

## "అధైర్య పడొద్దు".. ఆత్మహత్య చేసుకున్న వైసీపీ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన జగన్



**అమరావతి,:** నిన్న ఆత్మహత్య చేసుకున్న వైఎస్సార్సీపీ నాయకుడు నారాయణరెడ్డి కుటుంబాన్ని మాజీ సీఎం వైఎస్ జగన్ ఫోన్లో పరామర్శించారు. పార్టీ క్రమశిక్షణ సంఘం ఛైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఫోన్ నుంచి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఖాజీపేట మండలం దుంపలగట్టుకు చెందిన నారాయణరెడ్డిపై అక్రమంగా గంజాయి కేసు పెట్టి జైలుకు పంపడంతో పరువు పోయిందని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. అరెస్టు సమయంలో డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులు తీవ్రంగా హింసించారని వైఎస్ జగన్ కు కుటుంబ సభ్యులు తెలిపారు. పూలు అమ్ముకుని జీవించే నారాయణరెడ్డి మరణంతో భార్య, ఇద్దరి పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి మారింది. అధైర్య పడవద్దని కుటుంబ సభ్యులను వైఎస్ జగన్ ఓదార్చారు. వారి కుటుంబానికి వైఎస్సార్సీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నారాయణరెడ్డి ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకునే వరకూ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

## ట్రంప్, మస్క్ మధ్య దోస్తాన్ ఎక్కడ చెడింది..?




**న్యూఢిల్లీ,:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గెలుపుకి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆర్థికంగా ఎంత సాయం చేశారో అందరికీ తెలిసింది. అయితే, గెలిచిన తర్వాత ట్రంప్ కి అత్యంత సన్నిహితుడిగా మారిన మస్క్ డోజీ ద్వారా ఖర్చులు తగ్గించేందుకు కీలకంగా పని చేశారు. కానీ, ప్రస్తుతం ట్రంప్ తీసుకొస్తున్న బిగ్ బ్యూటిఫుల్ టాక్స్ బిల్ వీరి మధ్య దోస్తాన్ కి బీటలువార్చింది. ట్యాక్స్ తగ్గింపు బిల్లును ట్రంప్ సపోర్టు ఇస్తుండగా.. మస్క్ దానిపై బాహాటంగానే వ్యతిరేకిస్తున్నారు. కాగా, టెస్లా చీఫ్ తన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తనకు ఎదురు తిరడంపై స్పందించిన అమెరికా అధినేత నేను అస్సలు పట్టించుకోనని సమాధానం ఇచ్చాడు. తాను తెస్తున్న బిల్లు ద్వారా ఖర్చులను 1.6 ట్రిలియన్ డాలర్లు తగ్గడంతో పాటు పన్ను తగ్గింపులు లభిస్తాయని వెల్లడించారు. అయితే, బిల్ పాస్ కాకుండా నిలిపివేస్తే ప్రస్తుతం ఉన్న దాని కంటే 68 శాతం అధిక ట్యాక్సులు విధిస్తానని ట్రంప్ బెదిరించారు. అయితే, మరోపక్క ఎలాన్ మస్క్ తన ఎక్స్ ఖాతాలో తాను లేకపోతే డొనాల్డ్ ట్రంప్ ఖచ్చితంగా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయే వారని చేసిన పోస్ట్ తీవ్ర దుమారం రేపుతోంది. మస్క్ చేసిన ఈ కామెంట్స్ తనను తీవ్ర నిరాశకు గురి చేశాయని ట్రంప్ అన్నారు. మా ఇద్దరికీ మంచి దోస్తాన్ ఉంది.. అయితే ఇకపై అది కొనసాగుతుందని తాను అనుకోవటం లేదని చెప్పుకొచ్చారు. అసలు బిల్లు తయారీలో ఏం జరుగుతుందనే విషయం అందరికంటే ఎక్కువ మస్క్ కి తెలుసని.. ఇప్పుడెందుకు ఇలా అతడు మారిపోయాడో అర్థం కావటం లేదని డొనాల్డ్ ట్రంప్ చెప్పుకొచ్చారు. కాగా, అమెరికాలో అత్యంత గోప్యంగా ఉంచబడిన ఎప్‌స్టిన్ ఫైళ్లలో డొనాల్డ్ ట్రంప్ పేరు ఉందని ఎలాన్ మస్క్ పెద్ద బాంబు పేల్చారు. నిజాలు అన్ని భవిష్యత్తులో బయటకు వస్తాయంటూ ట్వీట్ చేశాడు. అందుకే ట్రంప్ ఈ పత్రాలు బయటకు రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ట్రంప్ గతంలో ఎప్‌స్టిన్‌తో తనకు గతంలో పరిచయం ఉందని ఒప్పుకున్నప్పటికీ, తన నేర కార్యకలాపాలలో తనకు ఎలాంటి ప్రమేయం లేదని చెప్పుకొచ్చాడని మస్క్ గుర్తు చేశారు.

# నోరు విప్పని ట్రంప్!



జూన్ ఒకటవ తేదీన రష్యాపై ఉక్రెయిన్ జరిపిన డ్రోన్ దాడి గురించి ఐదవ తేదీన ఇది రాసిన సమయానికి కూడా అమెరికా అధిపత డ్రోనాల్డ్ ట్రంప్ నోరు విప్పలేదు.ఇదొక ప్రపంచ వింత అనుకోవచ్చు. అయితే ట్రంపేమీ చెప్పలేదా అంటే నాలుగవ తేదీన తన సామాజిక మాధ్యమం ట్రూత్ ద్వారా స్పందించాడు. అది రేడియో లాంటిదే మనం వినటం తప్ప అడగటానికి ఉండదు.ఇంతకీ ట్రంప్ చెప్పిందేమిటి ! ఉక్రెయిన్ మీద ప్రతీకారం తీర్చుకుంటామని పుతిన్ గట్టిగా స్పష్టం చేశాడట. ఇన్ని రోజుల తరువాత ట్రంప్ వెల్లడించాల్సినంత గొప్ప రహస్యమా ఇది. దాడి జరిగిన మరుక్షణం నుంచి ప్రపంచమంతా అనుకుంటున్నదే. ఎప్పుడు, ఎలా అన్నది తెలియదు. ఈ ఉదంతం అనేక ప్రశ్నలను ముందుకు తెచ్చింది. పద్దెనిమిది నెలల పాటు పథకాన్ని రూపొందించామని జెలెన్‌స్కీ చెప్పాడు. సరే, రష్యా గ్రహించలేక పోయింది, అంతకంటే గొప్ప నిఘా తమది అని చెప్పుకొనే సిఐఏ ఎందుకు పసిగట్టలేక పోయినట్టు? దాడి గురించి ఉక్రెయిన్ మాకు ముందుగా చెప్పలేదని అధ్యక్ష భవనం చెప్పింది. అంటే జెలెన్‌స్కీ అమెరికాను నమ్మటం లేదని, ఇతర ఐరోపా దేశాలన్నీ కలసి అమెరికాను పక్కన పెట్టి ఈ దాడికి పథకం వేశాయని అనుకోవాలి. అంటే ట్రంప్‌ను పిచ్చిపుల్లయ్యను చేసినట్లే! ఉక్రెయిన్ దాడి ప్రపంచ మిలిటరీ వ్యూహాల్లో కొత్త ఎత్తుగడలకు తెరతీసిందని చెప్పవచ్చు.ఇప్పటికే పలుచోట్ల డ్రోన్‌ల దాడులు జరుగుతున్నప్పటికీ జూన్ ఒకటిన రష్యా మీద జరిగినదాడి కొత్త మలుపు తిప్పింది. రక్షణ చర్యలను సమీక్షించు కోవాల్సిన అగత్యాన్ని తెచ్చిపెట్టింది. పెద్ద క్షిపణులు, విమానాలే కాదు చిన్న చిన్నడ్రోన్లు కూడా ఎంతటి నష్టాన్ని కలిగిం చగలవో స్పష్టమైంది. ప్రత్యర్థి చిన్నవాడని నిర్లక్ష్యం చేయకూడదన్నది పెద్ద గుణపాఠం. తాడిని తన్నేవాడుంటే వాడిని తలదన్నేవాడుంటాడన్నది లోకోక్తి. రష్యాకూ అదే వర్తిస్తుంది. అలా అనుకుంటే పెరల్ హార్బర్ మీద రెండవ ప్రపంచ యుద్ధంలో జపాన్ దాడిని అమెరికా పసిగట్టలేకపోయింది. ఇప్పుడు రష్యా పొందిన నష్టం కంటే అది చాలా పెద్దది. అంతెందుకు చీమచిటుక్కుమంటే పసిగట్టే అమెరికా ఎంబసీల రహస్య వర్తమానాలను జూలియన్ అసాంజే బృందం లక్షలాది ఫైళ్లను బయటపెట్టటాన్ని అమెరికా నివారించలేకపోయింది. గాజా చుట్టూ ఎత్తైన ఇనుప కంచె, దాని మీద 24 గంటలూ నిఘా కెమెరాలు, సెన్సర్లు ఉన్నప్పటికీ హమాస్ సాయుధులు దాన్ని ఒకచోట బుల్డోజర్లతో కూల్చివేసి ఇజ్రాయిల్ గడ్డ మీద ప్రవేశించి కాల్పులు జరిపి అనేక మందిని హతమార్చిన ఉదంతం ఎలా జరిగిందన్నది ఇప్పటికీ బయటిలోకానికి తెలియదు.దానికి ప్రతిగా వేలాది మందిని చంపటం, గాజాను సర్వనాశనం చేయటం తప్ప హమాస్ సాయుధులను ఇజ్రాయిల్ పట్టుకోలేకపోయింది. మనదేశం అణుపరీక్ష చేసి లోకానికి తెలియచేసేంతవరకు అమెరికా పసిగట్టలేకపోయిన సంగతి వేరే చెప్పనవసరం లేదు. బుధవారం నాడు పుతిన్‌తో గంటకు పైగా సంభాషించినట్లు, మాటలు మంచిగా నడిచినట్లు ట్రంప్ చెప్పాడు. అయితే తమ సంభాషణ తక్షణమే శాంతికి దోహదం చేసేదిగా లేదని కూడా అన్నాడు. మరి సంభాషణలో కనిపించిన మంచేమిటి ? మరోవైపున ఉక్రెయిన్ మరిన్ని ఆయుధాల తయారీ, కొనుగోలుకు అవసరమైన నిధులు ఇస్తామని ఐరోపా మిత్రదేశాలన్నీ నిర్ణయించినట్లు వార్తలు, దాని మీద ట్రంప్ ఎందుకు మాట్లాడనట్లు? రష్యా తమ నగరాలపై వైమానిక, క్షిపణి దాడులు చేస్తే తట్టుకునేందుకు అవసరమైన రక్షణ వ్యవస్థలు అంటే పేట్రియాట్ లేదా అలాంటివి కావాలని బ్రసెల్స్‌లో సమావేశమైన నాటో ప్రతినిధులను జెలెన్‌స్కీ కోరాడు. తమకు తక్షణమే 46 బిలియన్ డాలర్లు కావాలని గతంలో విన్నవించుకున్నాడు. రోజుకు మూడు వందల డ్రోన్ల చొప్పున రష్యా ప్రయోగిస్తోందని, ఈ ఏడాది చివరివరకు ప్రయోగించే నిల్వలు దాని దగ్గర ఉన్నాయని బ్రిటన్ రక్షణ మంత్రి జాన్ హీలే అన్నాడు. ఉక్రెయిన్ దాడితో రష్యా బల హీనతలు వెల్లడైనందున శాంతి చర్చల్లో దానికి బేరమాడే శక్తి తగ్గిందని ఇలా రకరకాల విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఇవన్నీ కాక్షేపానికి బాగాపనికి వస్తాయి తప్ప వాస్తవ పరిస్థితిని పెద్దగా ప్రభావితం చేసేవి కాదు. అమెరికాను పక్కన పెట్టి నిజంగా ఐరోపా దేశాలు ఉక్రెయిన్‌ను ఎగదోస్తే అది తాత్కాలికం, అమెరికాను హెచ్చరించేందుకే తప్ప దాన్ని పూర్తిగా విస్మరించే స్థితిలో ఐరోపా లేదు. ట్రంప్, ఇతర అమెరికా నేతలు మాట్లాడిన మాటలు ఐరోపా సమాఖ్య నేతలను ఇరు కున పెట్టాయి. ట్రంప్ స్పందన తర్వాతే పుతిన్ కార్యాచరణ ఉంటుందని కొందరు చెప్పారు. అప్పటి వరకు ఆగేంత అ మాయకంగా రష్యన్లు ఉండరు. మౌనం ఒక ఎత్తుగడ మాత్రమే, ఏ రూపంలో ప్రతి దాడులుంటాయో, వాటిని జెలెన్‌స్కీ అనేకంటే అతగాడి వెనుక ఉండి ఎగదోస్తున్న నాటో దేశాలు ఎలా ఎదుర్కొంటాయన్నదే ఆసక్తి కలిగించే అంశం!

# రైతులకు ఖరీఫ్ కష్టాలు



ఖరీఫ్ కలిసివచ్చి తమ కష్టాలు గట్టెక్కాలనుకుంటూ పొలంబాట పట్టిన రైతులకు ఎప్పటిలాగా బాలారిష్టాలు తప్పడం లేదు. దేశానికి అన్నంపెట్టే అన్నదాతలకు కావాల్సింది ఏ కాలంలోనైనా పెట్టుబడి లేదా రుణం. అందులో ఎరువులు, విత్తనాలు ముఖ్యం. తగినంత విద్యుత్తూ అవసరమే. కానీ రాష్ట్రంలో వ్యవసాయ శాఖ ప్రణాళిక ప్రకటించక, క్షేత్రస్థాయిలో అధికారుల సహకారం లేక రైతులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. గత సీజన్‌లో 1.29 ఎకరాల్లో సాగవ్వగా ఈసారి 1.34 కోట్ల ఎకరాల్లో సాగుచేయాలనేది లక్ష్యం. అయితే దానికి అదనంగా మరో ఐదు లక్షలు సాగయ్యే అవకాశముందని వ్యవసాయశాఖ అంచనా. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు సుమారు ఎనిమిదిరోజుల ముందే ప్రారంభమయ్యాయి. ఇప్పటికే నారుపోస్తూ, దుక్కులు దున్నతూ రైతులు పొలాల్లో క్షణం తీరికలేకుండా గడుపుతున్నారు. ఈ సమయంలో రైతులకు పెట్టుబడి డబ్బులు అత్యవసరం. అందుకే రైతుభరోసా కోసం ఎదురుచూస్తున్నా సర్కారుస్పందించడం లేదు. ఎకరాకు రూ.7500 చొప్పున ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, దాన్ని రూ.6వేలకు కుదించింది. ఇది కూడా గత యాసంగిలో ఇవ్వడం మరిచింది. 53.4లక్షల మంది 72 లక్షల ఎకరాలకుగాను రూ.4,366 కోట్లు మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుంది. ఇంకా ఈసీజన్‌కు 70 లక్షల ఎకరాలకుగాను, రూ.7320 కోట్లు రైతు భరోసా కింద సాయం చేయాల్సి ఉంది. ఇది ఇలా ఉండగా నాణ్యత లేని విత్తనాలు మార్కెట్లల్లో అమ్ముతుండటంతో ప్రతియేటా ఐదు లక్షల నుంచి ఆరు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిం టున్నాయి. ప్రత్యేకంగా విత్తనచట్టం లేకపోవడంతో అక్రమార్కుల ఆటలు యధేచ్ఛగా సాగుతున్నాయి. నకిలీ విత్తనాలు, ఎరువుల బెడద లేకుండా పోలీసు, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించారు. కొన్నిచోట్ల పట్టుకున్నప్పటికీ ఇది మరింత వేగమవ్వాలి. ఎందుకంటే, ఇప్పటికే మహారాష్ట్ర, గుజరాత్, ఏపీ, కర్నాటక నుంచి దిగుమతి చేసుకున్నా నాసిరకం పత్తి విత్తనాలను బ్రాండెడ్ ప్యాకెట్లల్లో నింపి స్థానిక వ్యాపారుల ద్వారా రైతులకు అంటగడుతున్నారు. దీన్ని ఎంతమాత్రం ఊపేక్షించకూడదు. అలాగే అన్ని రకాల పంటల విత్తనాలు కలిపి రాష్ట్రానికి 20 లక్షల క్వింటాళ్లు అవసరమవ్వగా స్థానికంగా కొరత ఉన్నా, ప్రయివేటు కంపెనీలు మాత్రం అమెరికా, రష్యా, చైనా తదితర దేశాలకు ఎగుమతి చేస్తుండటం గమనార్హం. ఉత్తర భారతానికి సైతం జొన్న, కూరగాయల విత్తనాలు తెలంగాణ నుంచే సరఫరా అవుతున్నా ఎవరూ పట్టించు కోవడం లేదు. రాష్ట్రంలో 444 విత్తన కంపెనీలు, 467 సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నప్పటికీ వాటిపై వ్యవసాయశాఖ పర్యవేక్షణ అంతకన్నా లేదు. రాష్ట్రంలో సాగు, ఉత్పత్తులు ఏటేటా పెరుగుతున్నాయన్నది వాస్తవం. ఆ మేరకు విత్తనాల సరఫరాకు వ్యవసాయశాఖ సిద్ధమవుతున్నా రైతుల అవసరాలను నెరవేర్చలేక పోతున్నది. సన్నధాన్యానికి బోనస్ దృష్ట్యా 40 లక్షల ఎకరాల్లో సాగయ్యే పరిస్థితులున్నట్టు తెలుస్తోంది. ఇందుకు 16.70 లక్షల క్వింటాళ్ల విత్తనాలు అవసరమవగా 60.11 లక్షల ఎకరాల్లో సన్నాలు, 38.21 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు కలిపి 98.32 లక్షల ఎకరాలకు విత్తనాలను వ్యవసాయ శాఖ సిద్ధం చేసినట్టుగా సమాచారం. కానీ, రైతులకు అవి ఎక్కడా అందుబాటులో లేకపోవడం విచిత్రం. వానాకాలం సీజన్‌కు రాష్ట్రానికి 9.80 లక్షల టన్నుల యూరియా సరఫరాకు కేంద్రం అంగీకరించినా ఒక్క అడుగూ ముందుకుపడలేదు. అలాగే సర్కారు బడ్జెట్ ప్రకారం 2024- 25లో 35.25 లక్షల మంది రైతులకు రూ.90,792 కోట్ల పంట రుణాలు ఇవ్వాల్సి ఉండగా, రూ.60,713 కోట్లు(66.37 శాతం) మాత్రమే ఇచ్చింది. మొత్తం 72 లక్షల మందికి కమతాలుంటే, బ్యాంకులు కేవలం 45 లక్షల మందికి మాత్రమే రుణాలు అందజేశాయి. కౌలు రైతులకు పూర్తి ఎగనామంపెట్టాయి. ఈ విధానాన్ని సమీక్షించి స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం భూమి మేరకు రుణాలు మంజూరు చేయాల్సి ఉన్నా అది వాస్తవ రూపం దాల్చడం లేదు. గ్రామీణ, సెమీఅర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయ కుటుంబాల సగటు నెలవారీ ఆదాయం రూ.14 వేలలోపే. అందులోనూ పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం ద్వారా వచ్చేదే ఎక్కువ. ఒకవైపు పెట్టుబడి ఖర్చులు ఏడాదికేడాది తడిసిమోపెడవుతున్నాయి. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు కోరలు చాస్తున్నాయి. పంటలు విరగపండినా ధరలు పాతాళానికి జారిపోతున్నాయి. రాబడి తగ్గి, రుణభారం పెరిగి రైతులెందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అలాంటి బడుగు రైతుల జీవితాల్లో వెలుగులు నిండాలంటే స్వామినాథన్ సిఫారసు చేసినట్టుగా భూమి



విలువతోపాటు అన్నీ రకాల ఖర్చులనూ లెక్కించి ఆ మొత్తానికి యాభై శాతం అదనంగా కలిపి పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలి. శాస్త్రీయ పంటల ప్రణాళికకు, వ్యవస్థాగత రుణ సదుపాయాలు, కోల్డ్‌స్టోరేజీలు, సకాలంలో పరిహారాల పంపిణీలో ప్రభుత్వాలు అండగా నిలిస్తేనే అన్నదాతలను ఆదుకున్నట్టు, లేదంటే ఎప్పటిలాగే రైతులు మోసపోయినట్టే!

# హద్దులెరుగని అభిమానం నిండు ప్రాణాలు బలి

## ప్రాణాంతక నిర్లక్ష్యం




హద్దులెరుగని అభిమానం, నిర్వాహకుల అంతులేని నిర్లక్ష్యం, తన బాధ్యతేమిటో పూర్తిగా మరి చిన ప్రభుత్వం... వెరసి బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో బుధవారం సాయంత్రం 11 నిండు ప్రాణాలు బలయ్యాయి. మరో 50 మంది గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటుండగా, అందులో అయిదుగురి స్థితి ఆందోళనకరంగా ఉన్నదంటున్నారు. దుర్మరణం పాలైన వారిలో ఎక్కువమంది టీనేజ్ వయస్కులు. ఎంతో భవిష్యత్తుగల యువత ప్రాణాలు ఇలా హఠాత్తుగా కడతేరిపోవటం వారి తల్లిదండ్రులకూ, తోబుట్టువులకూ మాత్రమే కాదు... సమాజం మొత్తానికి తీవ్ర దుఃఖం కలిగించే అంశం. ఒక కథనం ప్రకారం ఈ కార్యక్రమానికి రాయల్ చాలెంజెర్స్‌బెంగళూరు(ఆర్‌సీబీ), కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ), డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థల్లో ఏ ఒక్కరూ అనుమతి తీసుకోలేదు! ఇంతకన్నా దారుణం ఉంటుందా? ఇప్పుడు సిటీ పోలీసు కమిషనర్‌నూ, డెప్యూటీ కమిషనర్‌నూ సస్పెండ్ చేశామంటున్నారు. మంచిదే. ఇతరుల మాటేమిటి? సెలబ్రిటీలు వచ్చినప్పుడూ, రాజకీయ సభలప్పుడూ, మతసంబంధ ఉత్సవాల సంద ర్భాల్లో భారీయెత్తున జనం గుమిగూడటం... తొక్కిసలాటలు, మరణాలు రివాజుగా మారాయి. కానీ ప్రభుత్వాలు, పోలీసులు నేర్చుకున్నదేమీ ఉండటం లేదని ఇవి పునరావృతం అవుతున్న తీరు చూస్తే తెలుస్తుంది. ఈ ఏడాది జనవరి మొదట్లోనే తిరుపతిలో టీటీడీ నిర్వాకం కారణంగా తొక్కి సలాటకు ఆరుగురు బలయ్యారు. ఆ నెలాఖరులో ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా వద్ద ఇలాంటి దుర్ఘటనలోనే 30 మంది చనిపోయారు. ఆ మరుసటి నెలలో న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో తొక్కిసలాట వల్ల 18 మంది కన్నుమూశారు. ఎన్ని ప్రాణాలు పోతే ప్రభుత్వాలు మేల్కొంటాయి? సామాజిక మాధ్యమాల ప్రభావమేమిటో అందరికీ తెలుసు. వాటిల్లో ఆ కార్యక్రమం గురించి ఆర్‌బీసీయే విస్తృత ప్రచారం చేసింది. తామున్నచోటికి అభిమాన ఆటగాళ్లు రాబోతున్నారని యువత ఉవ్విళ్లూరటం అసాధారణమేమీ కాదు. మన దేశంలో క్రికెట్‌కు మరే క్రీడకూ లేనంత ఆకర్షణ ఉంది. విరాట్ కోహ్లీ వస్తున్నాడంటే అది మరిన్ని వందల రెట్లు పెరుగుతుంది. ఇవి చాలవా పకడ్బందీ ముందస్తు ఏర్పాట్లు చేసుకోవటానికి? నిజానికి బెంగళూరు, దాని శివారు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి నుంచే అభిమానుల కోలాహలం మొదలైందని, బుధవారం ఉదయం నుంచి అది క్రమేపీ పెరుగుతూ పోయిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. ఇదంతా గమనించాక సాయంత్రం కార్యక్రమానికి అభిమానులు పోటెత్తుతారన్న అంచనా వుండొద్దా? బుధవారం వీధులన్నీ కిక్కిరిసిన వైనం గమనించి క్రికెటర్ల ర్యాలీని రద్దుచేసి కూడా 35,000 మందికి మాత్రమే సరిపడే స్టేడియంలో వేడుకలు సజావుగా ముగుస్తాయని ఎలా అనుకోగలిగారు? అందులోనూ ఈ కార్యక్రమానికి టిక్కెట్ విక్రయాలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ లేవు. మొత్తానికి స్టేడియంకు వెళ్తే తమ అభి మాన క్రికెటర్లనూ, వారు గెల్చుకున్న కప్పునూ స్వయంగా చూడొచ్చన్న సందేశం ప్రచారమైంది. పర్యవసానంగా నియంత్రణకు అందని రీతిలో లక్షల సంఖ్యలో అభిమానులు గుమిగూడారు. కార్యక్రమం కోసం 5,000 మంది పోలీసులను మోహరించామని, అయినా ఈ విషాదం చోటు చేసుకున్నదని కంటతడి పెడుతూ కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ చెప్పారు. పోలీసులు తమ శాయశక్తులా విధులు నిర్వర్తించారని, దాదాపు మూడు లక్షలమంది రావటంతో విఫల మయ్యామని ఆయన వివరించారు. కానీ ఆ తర్వాత కొన్ని గంటలకే భద్రతా ఏర్పాట్ల కోసం 1,000 మంది పోలీసుల్ని రంగంలోకి దించామని ప్రభుత్వ న్యాయవాది రాష్ట్ర హైకోర్టులో చెప్పారు. ఇది ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొన్న అయోమయాన్ని సూచిస్తోంది. అసలు ఆ వేయి మందైనా ఉన్నారా అనే సంశయాన్ని కలగజేస్తోంది. ప్రత్యక్ష సాక్షులైతే పోలీసుల సంఖ్య మొదటి నుంచీ తక్కువేనంటున్నారు. ఇంతమంది గుమిగూడే సందర్భాల్లో జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (ఎన్‌డీఎంఏ) సలహా తీసుకోవాలి. కానీ అదీ జరిగినట్టు లేదు. అసలు ఎవరు ఏ గేటువైపు వెళ్లాలో, ఎవరెక్కడ కూర్చోవాలో సూచించే బోర్డులు లేవు. మహిళలు, పిల్లల కోసమైనా విడిగా ప్రవేశద్వారం ఉండాలని నిర్వాహకులకు తోచలేదు. అభిమానుల్ని క్యూలో నియంత్రించేవారూ లేరు, పకడ్బందీ బ్యారికేడ్లూ లేవు. ఉన్న కొన్ని బ్యారికేడ్లూ తొక్కిసలాటలో ధ్వంసమయ్యాయి. ఇన్ని లోపాలు పెట్టుకుని ఊహించని స్థాయిలో జనం వచ్చిపడటంవల్లే ఇదంతా జరిగిందని చెబితే సరిపోతుందా? అసలు ఫైనల్ మ్యాచ్ జరిగిన 24 గంటలలోపే క్రికెటర్లకు నగరంలో సన్మానం చేయాలన్న తొందరెందుకు? అందుకోసం ఒకటి రెండు రోజుల వ్యవధి తీసుకుంటే జరిగే నష్టమేమిటి? జనం వేలంవెర్రిగా అభిమానించే క్రికెటర్లు వస్తున్నప్పుడూ,వారికిసన్మాన కార్యక్రమం నిర్వహించాలనుకున్నప్పుడూ తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం వుంటుందన్న అంచనా లేకపోవటం సహించరానిది. అప్పుడెప్పుడో ఆఫ్రికా దేశాల్లోనూ, వర్తమానంలో పాలస్తీనాలోనూ రోజుల తరబడి పస్తులుండి అనుకోకుండా ఆహార పదార్థాలతో వచ్చిన వ్యాన్ కోసం జనం ఎగబడి తొక్కిసలాటలు చోటుచేసుకున్న ఉదంతాలున్నాయి. ప్రాణాలు నిలుపుకోవా లన్న వారి తాపత్రయాన్ని అర్థం చేసుకోవచ్చు. కానీ వెర్రి అభిమానం కోసమో, విశ్వాసాల కోసమో ఎగబడటం, ప్రాణాలు కోల్పోవటం, ప్రభుత్వాలు తమ బాధ్యతేమీ లేదన్నట్టు ప్రవర్తించటం, మళ్లీ మరో విషాదం చోటుచేసుకునేవరకూ అంతా సవ్యంగా వున్నట్టు నటించటం ఎంతకాలం? కనీసం ఈ ఉదంతమైనా దేశంలో అందరి కళ్లూ తెరిపించాలి. ఇలాంటివి జరగనీయరాదని సంకల్పించాలి.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com

సంపాదకీయం

# చట్టసభలకూ పరిమితులు!

## (విశ్లేషణ)

నిబద్ధత, సచ్ఛీలత, నిబంధనలపట్ల సంపూర్ణ అవగాహన కలిగినవారి సారథ్యంలో చట్టసభలుంటే అలాంటిచోట ఆరోగ్యవంతమైన చర్చలు జరుగుతాయి. ప్రజాస్వామ్యానికి ఆ సభ తలమానికమవు తుంది. కానీ అధికార పక్షానికి వంతపాడేవారు, వారి ఇష్టారాజ్యానికి పక్కతాళం వేసేవారు అధ్యక్ష స్థానాల్లో కూర్చుంటున్నారు. తాము ఎవరికీ జవాబుదారీ కాదన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అలాంటి బాపతు నేతలకు ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చెంపపెట్టు. తనను బిహార్ శాసనమండలి నుంచి బహిష్కరించటాన్ని సవాలుచేస్తూ ఆర్జేడీ సభ్యుడు సునీల్ కుమార్ సింగ్ దాఖలు చేసిన పిటిషన్‌ను అంగీకరిస్తూ ఆయన్ను తక్షణం సభలోకి అనుమతించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. సభ్యుల అనుచిత ప్రవర్తనకు తగిన శిక్ష ఉండాలితప్ప మితిమీరకూడదని తేల్చిచెప్పింది. నిరుడు మార్చిలో గవర్నర్ ప్రసంగిస్తున్న సమయంలోనూ, ఆ తర్వాత ఆ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంలోనూ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై సునీల్ కుమార్ సింగ్ అవమానకరమైన వ్యాఖ్యలు చేశారన్నది అభియోగం. పాము కుబుసం విడిచినట్టు తరచు రాజకీయ అభిప్రాయాలు మార్చుకోవటం నితీశ్‌కు అలవాటని, ఇప్పటికి తొమ్మిదిసార్లు ముఖ్యమంత్రి అయినా ఎమ్మెల్యేగా ప్రజలనుంచి ఎన్నిక కాలేదని సునీల్‌కుమార్ సింగ్ విమర్శించారు. అధికారమే పరమావధిగా ఒకసారి యూపీఏ, మరోసారి ఎన్డీయే కూటములతో చెలిమి చేయటాన్ని ఎద్దేవా చేస్తూ ఆయన్ను 'పాల్తూరామ్' అని హేళన చేశారు. దీంతో ఈ వ్యాఖ్యలను ఎథిక్స్ కమిటీకి నివేదించారు. సునీల్ తప్పు చేశారని ఎథిక్స్ కమిటీ నిర్ధారించి సభా బహిష్కారానికి సిఫార్సుచేసింది. శాసనమండలి దీన్ని ఆమోదించి ఆయన్ను బహిష్కరిస్తూ తీర్మానించింది. మన రాజ్యాంగం కార్యనిర్వాహక వ్యవస్థ, శాసన వ్యవస్థ, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన చేసింది. చట్టసభలకు ప్రత్యేక హక్కులుంటాయని, వాటి కార్యకలాపాల్లో లేదా నిర్ణయాల్లో న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోరాదని సభాధ్యక్షులు భావిస్తుంటారు. ముఖ్యంగా ఫిరాయింపులపై వచ్చే ఫిర్యాదుల్ని ఎటూ తేల్చకుండా వదిలేస్తూ తమను ప్రశ్నించరాదంటున్నారు. చిన్న చిన్న కారణాలకు కూడా విపక్ష ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయటం, బహిష్కరణ వేటు వేయటం వంటివి రివాజయ్యాయి. కేవలం పాలకపక్ష ప్రయోజనాలను నెరవేర్చటం కోసమే స్పీకర్లు ఇలా ఇష్టాను సారం ప్రవర్తిస్తున్నారు. నిజమే... రాజ్యాంగంలోని **212(1)** అధికరణ ప్రకారం చట్టసభల కార్యకలా పాల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణతో ఆ కార్యకలాపాల చెల్లుబాటును న్యాయ స్థానాల్లో సవాలు చేయటానికి వీల్లేదు. నిర్వహణ సంబంధమైన అంశాల్లో న్యాయస్థానాల జోక్యంనుంచి చట్టసభలకు ఇది రక్షణనిస్తుంది. అయితే ఆ కార్యకలాపాల్లో భాగంగా తీసుకునే నిర్ణయాల్లో రాజ్యాంగ విరుద్ధత కనబడినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందన్నది నిపుణుల వాదన. తాజా కేసులో జరిగింది ఇదే. సునీల్ కుమార్ సింగ్ పిటిషన్‌కు అసలు విచార ణార్హత లేదని, **212(1)** అధికరణ న్యాయవ్యవస్థ జోక్యాన్నుంచి తమకు రక్షణనిస్తున్నదని శాసన మండలి తరఫు న్యాయవాది వాదించారు. సర్వోన్నత న్యాయస్థానం దీన్ని అంగీకరించలేదు. చట్ట సభల కార్యకలాపాలు వేరు, అందులో తీసుకునే నిర్ణయాలు వేరు అని స్పష్టం చేసింది. చట్టసభల నిర్ణయాలు వ్యక్తుల ప్రాథమిక హక్కుల్ని ప్రభావితం చేసినప్పుడు వాటిని సమీక్షించే అధికారం న్యాయస్థానాలకు ఉంటుందని తెలిపింది. అంతేకాదు... సునీల్‌కుమార్ సింగ్‌ను బహిష్కరిస్తూ తీసు కున్న ఎథిక్స్ కమిటీ నిర్ణయం పాలనాపరమైన చర్యే తప్ప శాసనవ్యవస్థ కార్యకలాపంగా పరిగణించలేమని తేల్చింది. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులతో కూడిన చట్టసభ నియంత పోకడలు పోకూడదు. మెజారిటీ ఉందన్న సాకుతో విపక్ష సభ్యుల గొంతు నొక్కడానికీ, వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించటానికీ ప్రయత్నించకూడదు. ఆ పరిస్థితులు తలెత్తితే న్యాయస్థానాలుమౌనంగా ఊరుకోబోవని తాజా తీర్పు తేటతెల్లం చేసింది. చట్టసభ కార్యకలాపాలు సాఫీగా సాగటానికి అనువైన నిబంధనలు రూపొందించుకొనేందుకు రాజ్యాంగంలోని **208**వ అధికరణ అధికారమిస్తోంది. సభ క్రమశిక్షణగా నడవటానికి ఎలాంటి నిబంధనలుండాలో, వాటిని ఉల్లంఘించినప్పుడు ఏయే చర్యలు తీసుకోవాలో ఈ నిబంధనలు నిర్దే శిస్తాయి. అయితే నిబంధనల అమలు పర్యవేక్షణకు ఏర్పడిన కమిటీలు తీసుకునే నిర్ణయాలు పాలనాసంబంధ పరిధిలోకి వస్తాయని గుర్తించటం తప్పనిసరని తాజా తీర్పు చెబుతోంది. ఆ నిర్ణయాలకు మెజారిటీ ఆమోదం ఉందా లేదా అనే అంశంతో దీనికి సంబంధం లేదు. ఒక చర్యకు ప్రతిగా తీసుకునే ఏ నిర్ణయమైనా హేతుబద్ధతకూ, తార్కికతకూ లోబడివుండటం అవసరం. పిచ్చు కపై బ్రహ్మాస్త్రం తరహాలో అధికారం ఉంది కదా అని ఏమైనా చేస్తామంటే ప్రజాస్వామ్యంలో చెల్లదు. చట్టసభలు ఇష్టానుసారం వ్యవహరించే రోజులు పోయాయి. సభానిర్వహణ సవ్యంగా జర గటం, క్రమశిక్షణ కట్టుతప్పకుండా చూడటం అవసరమే. కానీ అందుకోసం అమలుచేసే చర్యలు అతిగా ఉండకూడదు. సభ్యులు పరిధి మీరారని భావించినప్పుడు అభిశంసించడం, మందలించడం, నిర్దిష్ట కాలానికి సభనుంచి సస్పెండ్ చేయడంవంటి అవకాశాలున్నాయి. కానీ విచక్షణ మరిచి నేరుగా బహిష్కరణ వేటు వేయటం అతిగా వ్యవహరించటమే అవుతుంది. ఎథిక్స్ కమిటీల నిర్ణ యాలు పాలనానిర్వహణ కిందికే వస్తాయని, వాటిపై న్యాయసమీక్ష తప్పదని సుప్రీంకోర్టు నిర్ణయించటం హర్షించదగ్గది. నియంతృత్వ పోకడలు పోయే పాలకపక్షాలకు ఈ తీర్పు చెంపపెట్టు.

# జపాన్ ప్రైవేటు సంస్థ 'ఐస్పేస్' మూన్ మిషన్ విఫలం..

**ల్యాండర్‌తో తెగిన సంబంధాలు**

**జపాన్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ 'ఐస్పేస్' చంద్రయాత్రలో అపశ్రుతి**

**చంద్రుడిపై దిగే సమయంలో 'రెసిలెన్స్' ల్యాండర్‌తో కమ్యూనికేషన్ పూర్తిగా కట్**

**ఈ ఉదయం 8 గంటలకు సంబంధాలు తెగిపోయాయని ఐస్పేస్ వెల్లడి**

**ల్యాండర్‌ను తిరిగి సంప్రదించడం అసాధ్యమని, మిషన్ ముగిసినట్లు ప్రకటన**

**ఐస్పేస్ సంస్థకు ఇది వరుసగా రెండో వైఫల్యం**




ఢిల్లీ: జపాన్‌కు చెందిన ప్రైవేటు అంతరిక్ష పరిశోధన సంస్థ 'ఐస్పేస్' చేపట్టిన చంద్రుడి యాత్ర మరోసారి విఫలమైంది. చంద్రుడి ఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ అవ్వాలన్న వారి ఆశలు ఆవిరయ్యాయి. సంస్థ ప్రయోగించిన 'రెసిలెన్స్' అనే ల్యాండర్ జాబిల్లిపై దిగే కీలక సమయంలో భూ నియంత్రణ కేంద్రంతో సంబంధాలు కోల్పోయింది. ఈ విషయాన్ని ఐస్పేస్ మిషన్ కంట్రోలర్లు శుక్రవారం అధికారికంగా ప్రకటించారు. ఈ ఉదయం 8 గంటల సమయంలో 'రెసిలెన్స్' ల్యాండర్‌తో కమ్యూనికేషన్ పూర్తిగా నిలిచిపోయినట్లు ఐస్పేస్ తెలిపింది. తెగిపోయిన సంబంధాలను పునరుద్ధరించే ప్రయత్నాలు ఫలించలేదని, ఇక అది సాధ్యం కాదని నిర్ధారణకు వచ్చినట్లు పేర్కొంది. దీంతో, ఈ మూన్ మిషన్‌ను ముగించినట్లు వారు ప్రకటించారు. ల్యాండర్ విఫలం కావడానికి గల కచ్చితమైన కారణాలను అన్వేషిస్తున్నామని ఐస్పేస్ వ్యవస్థాపకుడు, సీఈవో తకేషి హకమడ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరిలో అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా 'రెసిలెన్స్' ల్యాండర్‌ను ప్రయోగించారు. సుమారు ఐదు నెలల సుదీర్ఘ ప్రయాణం అనంతరం మేలో ఈ వ్యోమనౌక చంద్రుడి కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశించింది. ముందుగా నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఈ ల్యాండర్ చంద్రుడి ఉపరితలంపై 'మేర్ ఫ్రిగోరిస్' (చలి సముద్రం) అనే నిర్దిష్ట ప్రదేశంలో సాఫ్ట్‌గా ల్యాండ్ అవ్వాల్సి ఉంది. అయితే, చంద్రుడి కక్ష్య నుంచి విడిపోయి ల్యాండింగ్ ప్రదేశం వైపు వెళ్తున్న సమయంలోనే మిషన్ కంట్రోల్ కేంద్రానికి ల్యాండర్‌తో ఉన్న అన్ని రకాల సంబంధాలు తెగిపోయాయి. కాగా, చంద్రుడిపైకి ల్యాండర్‌ను పంపేందుకు ఐస్పేస్ సంస్థ ప్రయత్నించడం ఇది రెండవసారి. 2023లో కూడా ఇలాంటి ఒక ప్రయోగాన్ని చేపట్టగా, అప్పుడు కూడా అది విఫలమైంది. ఇదిలా ఉంటే, చంద్రుడిపై విజయవంతంగా కాలుమోపిన ఐదో దేశంగా జపాన్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. గత ఏడాది జపాన్ ప్రభుత్వ అంతరిక్ష సంస్థ ప్రయోగించిన స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్ (స్లిమ్) అనే ల్యాండర్ చంద్రుడిపై సురక్షితంగా దిగింది. అయితే, ప్రైవేటు సంస్థ ఐస్పేస్ ప్రయత్నాలు మాత్రం ఇంకా ఫలించలేదు.

# బెంగళూరు తొక్కిసలాట కేసు.. ఎవరీ నిఖిల్ సోసాలె?

**ఆర్సీబీ మార్కెటింగ్, రెవెన్యూ హెడ్ నిఖిల్ సోసాలె అరెస్ట్**

**రెండేళ్లుగా ఆర్సీబీ మార్కెటింగ్, రెవెన్యూ విభాగానికి అధిపతిగా సోసాలె**

**ముంబైకి వెళ్తుండగా విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు**






ఆర్సీబీ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాటకు సంబంధించిన కేసులో బెంగళూరు ఫ్రాంచైజీకి చెందిన నలుగురు అధికారులను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిలో ఆర్సీబీ మార్కెటింగ్, రెవెన్యూ విభాగం చీఫ్ నిఖిల్ సోసాలె కూడా ఉన్నారు. తొక్కిసలాట ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం తీవ్రంగా స్పందించారు. బాధ్యులైన ఆర్సీబీ ప్రతినిధులను తక్షణమే అరెస్ట్ చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు హత్యాయత్నం కిందకు రాని నేరం (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ క్రమంలో నిఖిల్ సోసాలెను ఈ ఉదయం సుమారు 6:30 గంటలకు బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. ఆయనతోపాటు ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన మరో ముగ్గురు సభ్యులను కూడా అరెస్ట్ చేశారు.

ఎవరీ నిఖిల్ సోసాలె?

నిఖిల్ సోసాలె రెండేళ్లుగా ఆర్సీబీ మార్కెటింగ్, రెవెన్యూ విభాగానికి అధిపతిగా వ్యవహరిస్తున్నారు. ఆయన లింక్డ్ఇన్ ప్రొఫైల్ ప్రకారం సోసాలె వాస్తవానికి ఆర్సీబీ యాజమాన్య సంస్థ అయిన యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ (యూఎస్ఎల్)ను నిర్వహిస్తున్న దయాజియో ఇండియా ఉద్యోగి. మాజీ యజమాని విజయ్ మాల్యా వైదొలిగిన తర్వాత ఆర్సీబీకి యూఎస్ఎల్ పూర్తిస్థాయి యజమానిగా మారింది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న సోసాలె 13 ఏళ్లుగా దయాజియో సంస్థలో పనిచేస్తున్నారు. ఈ సమయంలో ఆయన ఆర్సీబీ ఫ్రాంచైజీతో చాలా దగ్గరగా పనిచేసినట్లు తెలుస్తోంది. ఆర్సీబీ బ్రాండ్ డిజైన్, వ్యూహరచనలో సోసాలె కీలక పాత్ర పోషిస్తున్నారని సమాచారం. గతంలో ఆయన ఆర్సీబీలో బిజినెస్ పార్ట్‌నర్‌షిప్స్ విభాగానికి కూడా హెడ్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తరచూ విరాట్ కోహ్లీ భార్య అనుష్క శర్మతో కలిసి ఆర్‌సీబీ ప్రైవేట్ బాక్సుల్లో సోసాలె కనిపిస్తుంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో విరాట్ కోహ్లీ కూడా ఆయన్ను ఫాలో అవుతున్నారు. ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌లాండ్‌లో ఉన్న జేమ్స్ కుక్ యూనివర్సిటీ నుంచి ఆయన డబుల్ మేజర్ పూర్తి చేశారు. ఆర్‌సీబీ మార్కెటింగ్, వ్యాపార వ్యూహాల్లో సంవత్సరాలుగా పాలుపంచుకుంటున్నందున, ఫ్రాంచైజీ తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలిచిన సందర్భంగా ఏర్పాటు చేసిన బస్ పరేడ్ నిర్వహణలో సోసాలె పాత్ర ఉండి ఉండవచ్చని భావిస్తున్నారు. అలాగే, ఆటగాళ్లు, ఫ్రాంచైజీ అధికారుల మధ్య సమన్వయకర్తగా కూడా ఆయన వ్యవహరించి ఉండవచ్చని తెలుస్తోంది. సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అక్షయ్ నేతృత్వంలో ఆపరేషన్ నిర్వహించి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిని నేడు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగించే అవకాశం ఉంది.

# నేను పారిపోయానని అనండి ఒప్పుకుంటాను.. కానీ దొంగ అంటే మాత్రం ఒప్పుకొనేదే లేదు: విజయ్ మాల్యా

**ముందే ఖరారైన పర్యటనలో భాగంగానే విడిచిపెట్టానన్న మాల్యా**

**'దొంగ' అనే పదం ఎక్కడి నుంచి వచ్చిందని ప్రశ్న**

**న్యాయమైన విచారణకు హామీనిస్తే భారత్‌కు వస్తానని హామీ**

**ఎయిర్‌లైన్స్ పతనానికి 2008 నాటి ఆర్థిక సంక్షోభమే కారణమని వెల్లడి**



ఢిల్లీ: సుమారు రూ. 9,000 కోట్లకు పైగా మోసం, మనీలాండరింగ్ ఆరోపణలతో భారత్‌లో వాంటెడ్‌గా ఉన్న వ్యాపారవేత్త విజయ్ మాల్యా మరోసారి వార్తల్లోకి ఎక్కారు. పారిశ్రామికవేత్త రాజ్ షమానీతో నాలుగు గంటల పాటు సాగిన ఒక పాడ్‌కాస్ట్ సంభాషణలో ఆయన తనపై ఉన్న కేసులు, వివాదాస్పద రీతిలో భారత్ విడిచి వెళ్లడం, చట్టపరమైన పోరాటాలు, కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ పతనం, తనను 'దొంగ' అని పిలవడం వంటి అంశాలపై స్పందించారు. "మార్చి (2016) తర్వాత భారత్ కు వెళ్లనందుకు నన్ను పరారీలో ఉన్న వ్యక్తి అనొచ్చు. నేను పారిపోలేదు, ముందే ఖరారైన పర్యటనలో భాగంగానే భారత్ నుంచి బయటకు వెళ్లాను. సరే, నేను సరైనవని భావించే కారణాల వల్ల తిరిగి రాలేదు, కాబట్టి మీరు నన్ను పరారీలో ఉన్న వ్యక్తి అని పిలవాలనుకుంటే పిలవండి, కానీ 'దొంగ' అనే మాట ఎక్కడి నుంచి వస్తోంది? అసలు 'దొంగతనం' ఎక్కడ జరిగింది?" అని మాల్యా పాడ్‌కాస్ట్ లో ప్రశ్నించారు. 2016 నుంచి యూకేలో నివసిస్తున్న మాల్యా విదేశాల్లో ఉండటం వల్ల తన న్యాయపరమైన చిక్కులు మరింత తీవ్రమయ్యాయా అనే అంశంపైనా వ్యాఖ్యానించారు. "భారత్ లో నాకు న్యాయమైన విచారణ, గౌరవప్రదమైన ఉనికి లభిస్తుందన్న హామీ ఉంటే మీరు చెప్పింది నిజమే కావచ్చు, కానీ నాకు ఆ హామీ లేదు" అని ఆయన అన్నారు. న్యాయబద్ధమైన విచారణకు హామీ ఇస్తే భారత్ కు తిరిగి వస్తారా? అని ప్రశ్నించగా "నాకు అలాంటి హామీ లభిస్తే కచ్చితంగా దాని గురించి ఆలోచిస్తాను" అని మాల్యా బదులిచ్చారు. అప్పగింత కేసులో యూకే హైకోర్ట్ ఆఫ్ అప్పీల్ ఇచ్చిన తీర్పును ఆయన ఉటంకిస్తూ భారతీయ జైళ్లలోని పరిస్థితులు యూరోపియన్ మానవ హక్కుల కన్వెన్షన్‌లోని ఆర్టికల్ 3ను ఉల్లంఘిస్తున్నాయని తేలిందని చెప్పారు. "అందువల్ల వారిని వెనక్కి పంపలేరు" అని పేర్కొంటూ తనకు కూడా అలాంటి ఆందోళనలు ఉన్నాయని పరోక్షంగా పేర్కొన్నారు. ఈ ఇంటర్వ్యూలో మాల్యా చేసిన వ్యాఖ్యలపై భారత ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు.

కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ సంక్షోభం

కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ పతనం గురించి మాల్యా మాట్లాడుతూ 2008 నాటి ప్రపంచ ఆర్థిక సంక్షోభం ఇందుకు ఒక ప్రధాన కారణమని తెలిపారు. "మీరు లెమాన్ బ్రదర్స్ గురించి విన్నారా? ప్రపంచ ఆర్థిక సంక్షోభం గురించి విన్నారు కదా? అది భారత్ పై ప్రభావం చూపలేదా? కచ్చితంగా చూపింది" అని షమానీతో అన్నారు. "ప్రతి రంగం దెబ్బతింది. డబ్బు ఆగిపోయింది. భారత రూపాయి విలువ కూడా దెబ్బతింది" అని ఆయన వివరించారు. "నేను శ్రీ ప్రణబ్ ముఖర్జీ వద్దకు వెళ్లి నాకు ఒక సమస్య ఉందని చెప్పాను. కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్ కార్యకలాపాలు తగ్గించుకోవాలి, విమానాల సంఖ్యను తగ్గించాలి, ఉద్యోగులను తొలగించాలి, ఎందుకంటే ఈ కుంగిపోయిన ఆర్థిక పరిస్థితుల్లో కార్యకలాపాలు కొనసాగించలేను" అని చెప్పారు. అయితే, కార్యకలాపాలు తగ్గించవద్దని, బ్యాంకులు మద్దతు ఇస్తాయని ఆయన తనకు సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నారు.

న్యాయపరమైన చిక్కులు

మాల్యాకు న్యాయపరమైన చిక్కులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 9న భారతీయ స్టేట్ బ్యాంక్ సహా భారతీయ రుణదాతల కన్సార్టియంకు చెల్లించాల్సిన రూ. 11,101 కోట్ల రుణానికి సంబంధించి లండన్ హైకోర్టు జారీ చేసిన దివాలా ఉత్తర్వులపై చేసిన అప్పీల్‌ను ఆయన కోల్పోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో మాల్యా కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. వాస్తవంగా చెల్లించాల్సిన రూ. 6,200 కోట్లకు బదులుగా బ్యాంకులు ఇప్పటికే రూ. 14,000 కోట్లు రాబట్టుకున్నాయని తన న్యాయవాది ద్వారా వాదించారు. రాబట్టుకున్న మొత్తానికి సంబంధించిన వివరణాత్మక లెక్కలను అందించాలని రుణదాతలను ఆదేశించాలని ఆయన కోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఆర్. దేవదాస్ నేతృత్వంలోని ధర్మాసనం సంబంధిత బ్యాంకులకు, రుణ రికవరీ అధికారులకు నోటీసులు జారీ చేసింది. అయినప్పటికీ 2012లో కార్యకలాపాలు నిలిపివేసిన కింగ్ ఫిషర్ ఎయిర్ లైన్స్‌కు సంబంధించిన ఆర్థిక నేరాలకు గాను విచారణ ఎదుర్కోవడానికి మాల్యాను తీసుకొచ్చేందుకు భారత అధికారులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు.

# ఆర్బీఐ గుడ్ న్యూస్.. తగ్గనున్న ఇంటి, ఇతర రుణాల ఈఎంఐలు

ఢిల్లీ: దేశ ప్రజలకు, ముఖ్యంగా రుణ గ్రహీతలకు భారతీయ రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ) గుడ్ న్యూస్ చెప్పింది. కీలకమైన రెపో రేటును గణనీయంగా తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) ఈ ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. రెపో రేటును ఏకంగా 50 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో కొత్త రేటు 5.5 శాతానికి చేరింది. ఈ నిర్ణయం వల్ల దీర్ఘకాలిక రుణాలు, ముఖ్యంగా గృహ రుణాలు తీసుకున్న వారికి ఈఎంఐల భారం తగ్గే అవకాశం ఉంది.

ఏకగ్రీవ నిర్ణయంతో ఆమోదం

ప్రతి రెండు నెలలకోసారి జరిగే ద్రవ్య విధాన కమిటీ సమావేశంలో ఈ నిర్ణయాన్ని ఏకగ్రీవంగా తీసుకున్నట్లు ఆర్బీఐ వర్గాలు వెల్లడించాయి. ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుత ద్రవ్యోల్బణం, ఆర్థిక వృద్ధిరేటు అంచనాలు, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలపై లోతైన చర్చ జరిగిన అనంతరం వడ్డీ రేట్ల తగ్గింపునకు కమిటీ సభ్యులందరూ ఆమోదం తెలిపారు. ఈ తగ్గింపు తక్షణమే అమల్లోకి వస్తుందని ఆర్బీఐ స్పష్టం చేసింది.

గృహ కొనుగోలుదారులకు ప్రయోజనం

ఆర్బీఐ తీసుకున్న ఈ నిర్ణయం రుణగ్రహీతలకు, ప్రత్యేకించి ఇల్లు కొనాలనుకునే వారికి పెద్ద ఊరటనిస్తుందని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు. రెపో రేటు తగ్గడం వల్ల బ్యాంకులు తాము ఇచ్చే రుణాలపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశం ఉంది. దీని ఫలితంగా గృహ రుణాలు, వాహన రుణాలు, వ్యక్తిగత రుణాలపై నెలవారీ వాయిదాలు (ఈఎంఐలు) తగ్గుముఖం పడతాయి. ఇది వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచి, ఆర్థిక వ్యవస్థకు మరింత ఊతమిస్తుందని భావిస్తున్నారు.

ప్రపంచ సవాళ్లున్నా భారత్ వృద్ధిపథంలోనే: ఆర్బీఐ గవర్నర్

ఈ సందర్భంగా ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక పరిస్థితి ఇంకా కొంత బలహీనంగానే ఉందని, ప్రపంచ వాణిజ్య అంచనాలను కూడా తగ్గించారని గుర్తుచేశారు. అయినప్పటికీ, భారతదేశం వేగంగా వృద్ధి చెందుతూనే ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. "భారతదేశ ఆర్థిక బలానికి ఐదు కీలక రంగాల్లోని పటిష్టమైన ఆర్థిక స్థితిగతులే కారణం. భారత ఆర్థిక వ్యవస్థ స్థానిక, విదేశీ పెట్టుబడిదారులకు అపారమైన అవకాశాలను అందిస్తోంది. మనం ఇప్పటికే వేగంగా అభివృద్ధి చెందుతున్నాం, భవిష్యత్తులో మరింత వేగంగా ఎదగాలని ఆకాంక్షిస్తున్నాం" అని గవర్నర్ సంజయ్ మల్హోత్రా వివరించారు. ఈ నిర్ణయం దేశ ఆర్థిక ప్రగతికి మరింత దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# రిటైర్మెంట్ ప్రకటించిన ఐపీఎల్ దిగ్గజం



ఐపీఎల్ దిగ్గజ బౌలర్ పియూశ్ చావ్లా క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నట్లు ఇవాళ (జూన్ 6) వెల్లడించాడు. అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు దేశవాళీ క్రికెట్‌కు కూడా ఇది వర్తిస్తుందని పేర్కొన్నాడు. 36 ఏళ్ల పియూశ్ చావ్లాకు ఐపీఎల్‌లో ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఆరంభ సీజన్ నుంచి (2008) క్యాష్ రిచ్ లీగ్ ఆడుతున్న అతను 192 మ్యాచ్‌ల్లో 192 వికెట్లు తీసి లీడింగ్ వికెట్ టేకర్ల జాబితాలో సంయుక్తంగా మూడో స్థానంలో ఉన్నాడు. ఐపీఎల్‌లో చహల్ (221), భువనేశ్వర్ కుమార్ (198) మాత్రమే చావ్లా కంటే ఎక్కువ వికెట్లు తీశారు. సునీల్ నరైన్ చావ్లాతో సమానంగా 192 వికెట్లు తీశాడు.

2008లో కింగ్స్ ఎలెవెన్ పంజాబ్‌తో కెరీర్ ప్రారంభించిన చావ్లా.. ఆతర్వాత కేకేఆర్, సీఎస్‌కే, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలకు ప్రాతినిథ్యం వహించాడు. చివరిగా 2024 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిథ్యం వహించిన చావ్లాను ఈ సీజన్ మెగా వేలంలో ఏ ఫ్రాంచైజీ కొనుగోలు చేయలేదు. రైట్ ఆర్మ్ లెగ్ స్పిన్ బౌలర్ అయిన చావ్లా 2006లో టీమిండియా తరఫున టెస్ట్ అరంగేట్రం చేసి, ఆ ఫార్మాట్‌లో 3 మ్యాచ్‌లు ఆడి 7 వికెట్లు తీశాడు. ఆ తర్వాత 2007లో వన్డే, 2010లో టీ20 అరంగేట్రం చేసిన చావ్లా 25 వన్డేల్లో 32 వికెట్లు, 7 టీ20ల్లో 4 వికెట్లు తీశాడు. చావ్లా అంతర్జాతీయ కెరీర్ అంత సుదీర్ఘంగా సాగనప్పటికీ.. భారత్ గెలిచిన రెండు వరల్డ్‌కప్ టోర్నీల్లో భాగంగా ఉన్నాడు. చావ్లా 2007 టీ20 వరల్డ్‌కప్, 2011 వన్డే వరల్డ్‌కప్ గెలిచిన భారత జట్లలో సభ్యుడిగా ఉన్నాడు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అలీఘడ్‌లో జన్మించిన చావ్లా.. సొంత రాష్ట్రం? తరఫున 2008-2013 వరకు దేశవాళీ క్రికెట్ ఆడాడు. ప్రస్తుతం అతను గుజరాత్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. చావ్లాకు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లోనూ ఘనమైన ట్రాక్ రికార్డు ఉంది. ఇందులో 137 మ్యాచ్‌లు ఆడిన చావ్లా మూడు 10 వికెట్ల ప్రదర్శనలు, 23 ఐదు వికెట్ల ప్రదర్శనల సాయంతో 446 వికెట్లు తీశాడు. దేశవాళీ క్రికెట్‌లో చావ్లా బ్యాటర్‌గానూ రాణించాడు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అతని పేరు మీద 6 సెంచరీలు, 36 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

# ‘అతడికి చాలా అనుభవం ఉంది.. ఇంగ్లండ్ టూర్‌లో కీలకం కానున్నాడు’




భారత క్రికెట్ జట్టు ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఇంగ్లండ్‌కు పయనమైంది. హెడ్‌కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ శుబ్‌మన్ గిల్ నేతృత్వంలో మొత్తం టీమ్ సభ్యులు శుక్రవారం ముంబై విమానశ్రాయం నుంచి లండన్‌కు బయలు దేరారు. అక్కడకి వెళ్లాక పది రోజుల పాటు ప్రాక్టీస్ క్యాంపులో టీమిండియా తీవ్రంగా శ్రమించనుంది. జూన్ 20 నుంచి లీడ్స్ వేదికగా ఈ రెడ్‌బాల్ సిరీస్ ప్రారంభం కానుంది. కాగా లండన్ విమానం ఎక్కేముందు టీమిండియా హెడ్ కోచ్ గౌతం గంభీర్, కొత్త టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ విలేకరుల సమావేశంలో పాల్గోనున్నారు.

ఈ సందర్భంగా ఎనిమిదేళ్ల తర్వాత భారత టెస్టు జట్టులోకి పునరాగమనం చేసిన కరుణ్ నాయర్‌పై గంభీర్ ప్రశంసల వర్షం కురిపించాడు. ఇంగ్లండ్ పర్యటనలో కరుణ్ నాయర్ అనుభవం భారత జట్టుకు కీలకం కానుందని గంభీర్ అభిప్రాయపడ్డాడు. “కరుణ్ నాయర్ దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించి తిరిగి భారత జట్టులోకి వచ్చాడు. అది దేశవాళీ క్రికెట్‌కు ఉన్న ప్రాముఖ్యత. యువ ఆటగాళ్లకు నేను చెప్పేది ఒక్కటే. డిమాస్టిక్ క్రికెట్‌లో మీరు అత్యున్నత ప్రదర్శన ఇస్తున్నన్ని రోజులు మీకోసం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ఈ పర్యటనలో కరుణ్ నాయర్ అనుభవం జట్టుకు ఎంతోగానే ఉపయోగపడనుంది.

కౌంటీ క్రికెట్‌లో ఆడిన ఎక్స్‌పీరియన్స్ కూడా అతడికి ఉంది. కౌంటీల్లో కూడా పరుగులు సాధించాడు. అక్కడి పరిస్థితులు అతడికి బాగా తెలుసు. ఇప్పుడు ఇండియా-ఎ తరపున కూడా సెంచరీ చేశాడు. ఇటువంటి పర్యటనలకు మంచి ఫామ్‌లో ఉన్న ఆటగాళ్లు జట్టులో ఉండడం చాలా ముఖ్యం. మరో ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఆటగాళ్లు ఫామ్‌ను ఒకటి లేదా రెండు టెస్ట్ మ్యాచ్‌ల ఆధారంగా అంచనా వేయాలనుకోవడం లేదు. ఎవరైతే నిలకడగా పరుగులుసాధిస్తారో, వారు అంతర్జాతీయ క్రికెట్‌లో కూడా రాణిం

చగలరు అని ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో గంభీర్ పేర్కొన్నాడు. కాగా కరుణ్ నాయర్ దేశవాళీ క్రికెట్‌లో పరుగులు వరద పారించాడు. రంజీ ట్రోఫీ 2024-25లో విదర్భ ఛాంపియన్‌గా నిలవడంలో కరుణ్‌ది కీలక పాత్ర. ఈ టోర్నీలో 16 ఇన్నింగ్స్‌లలో 53.93 సగటుతో 863 పరుగులు చేసి నాలుగో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. నాయర్ చివరసారిగా భారత జట్టు తరపున 2017లో ఆడాడు. కాగా వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఏకైక భారత ఆటగాడిగా కరుణ్ నాయర్ కొనసాగుతున్నాడు.

# ఆర్‌సీబీని కొన్నది క్రీడా స్ఫూర్తితో కాదు.. 18 ఏళ్ల తర్వాత అసలు విషయం చెప్పేసిన విజయ్ మాల్యా





: రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ం తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకున్న వేళ, ఆ జట్టు మాజీ యజమాని విజయ్ మాల్యా సంచలన విషయాలు వెల్లడించారు. 2008లో %=జదీ% ఫ్రాంచైజీని ఎందుకు కొనుగోలు చేయాల్సి వచ్చిందో, అప్పటి యువ ఆటగాడు విరాట్ కోహ్లీని జట్టులోకి ఎలా తీసుకున్నారో ఆయన తాజాగా ఒక పోడ్‌కాస్ట్‌లో వివరించారు.

వ్యాపార ప్రమోషనే ప్రధాన లక్ష్యంగా..

తనకు క్రికెట్‌పై ఉన్న అమితమైన ఇష్టంతోనో, లేదా తన విలాసవంతమైన జీవనశైలిని ప్రదర్శించుకోవడానికో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును కొనుగోలు చేశానని చాలామంది అనుకుంటారని, కానీ అది నిజం కాదని మాల్యా స్పష్టం చేశారు. “నా ప్రాథమిక ఉద్దేశం వ్యాపారమే. రాయల్ ఛాలెంజ్, కింగ్‌ఫిషర్ వంటి నా బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవడానికే ఆర్‌సీబీని కొన్నాను” అని ఆయన తెలిపారు. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు, లలిత్ మోడీ బీసీసీఐ కమిటీకి ఈ లీగ్ గురించి వివరించారని, అది తనను ఎంతగానో ఆకట్టుకుందని మాల్యా అన్నారు. “లలిత్ మోడీ ఒకరోజు నాకు ఫోన్ చేసి, టీమ్‌లను వేలం వేయబోతున్నారు, మీరు కొంటారా అని అడిగారు. నేను మూడు ఫ్రాంచైజీల కోసం బిడ్ చేశాను, ముంబైని చాలా తక్కువ తేడాతో కోల్పోయాను” అని ఆయన వివరించారు. చివరికి, బెంగళూరును కొనుగోలు చేయడానికి తాను 112 మిలియన్ డాలర్లు (2008 నాటి విలువ ప్రకారం దాదాపు 600-700 కోట్ల రూపాయలు) చెల్లించినట్లు మాల్యా చెప్పారు. ఇది ఐపీఎల్‌లో రెండో అత్యధిక బిడ్ అని, దీన్ని ఇప్పుడు చూస్తే అదొక అద్భుతమైన పెట్టుబడి అని అభివర్ణించారు.

ఆర్‌సీబీని ఒక ‘లైఫ్‌స్టైల్ బ్రాండ్’గా మార్చాలనే లక్ష్యంగా..

క్రికెట్ టీం కంటే %=జదీ%ని ఒక లైఫ్‌స్టైల్ బ్రాండ్‌గా మార్చాలనే లక్ష్యం తనకు ఉండేదని మాల్యా వెల్లడించారు. మ్యాచ్‌ల తర్వాత పార్టీలు, చీర్ లీడర్‌లు, అభిమానులతో నిరంతరం సంబంధాలు వంటివి తన వ్యూహంలో భాగమేనని ఆయన అన్నారు. కింగ్‌ఫిషర్, రాయల్ ఛాలెంజ్ తన బ్రాండ్‌లు కాబట్టి, వాటిని ప్రచారం చేసుకోవడానికి ప్రతి మ్యాచ్‌ను ఒక ఈవెంట్‌గా మార్చాలని తాను కోరుకున్నట్లు మాల్యా పేర్కొన్నారు. “ప్రజలు దీన్ని ఆర్భాటంగా భావించవచ్చు, కానీ అది ఒక వ్యూహం. బెంగళూరు ప్రజలు దాన్ని ఇష్టపడ్డారు, ఆర్‌సీబీ ఆ నగరానికి హృదయ స్పందనగా మారింది” అని ఆయన అన్నారు.

విరాట్ కోహ్లీని గుర్తించింది మాల్యాయే..

యువకుడు విరాట్ కోహ్లీని జట్టులోకి తీసుకోవడం వెనుక కూడా మాల్యా ప్రమేయం ఉంది. అండర్-19 ప్రపంచకప్ ఆడుతున్న సమయంలో కోహ్లీని చూసి, అతని ప్రతిభకు తాను ఎంతగానో ముగ్ధుడినయ్యానని మాల్యా గుర్తు చేసుకున్నారు. “నేను అతన్ని ఎంపిక చేసుకున్నాను, 18 సంవత్సరాల తర్వాత కూడా అతను అక్కడే ఉండటం అద్భుతం. అప్పుడు అతను చిన్న పిల్లవాడు, కానీ ఎనర్జీతో, గొప్ప టాలెంట్‌తో ఉన్నాడు, ఇప్పుడు భారతదేశం చూసిన గొప్ప క్రికెటర్లలో ఒకడు” అని మాల్యా ప్రశంసించారు. RCB 2025లో తొలిసారి ఐపీఎల్ ట్రోఫీని గెలుచుకోవడంతో, మాల్యా తన కలను నెరవేర్చుకున్నానని హర్షం వ్యక్తం చేశారు. గతంలో విరాట్ కోహ్లీతో సహా రాహుల్ ద్రావిడ్, అనిల్ కుంబ్లే, జాక్వెస్ కల్లిస్ వంటి గొప్ప ఆటగాళ్లను జట్టులోకి తీసుకున్నానని, ఐపీఎల్ ట్రోఫీని బెంగళూరుకు తీసుకురావడమే తన లక్ష్యంగా జట్టును నిర్మించానని ఆయన చెప్పారు.

విజయ్ మాల్యా చేసిన ఈ వ్యాఖ్యలు భారత క్రికెట్‌లో, ముఖ్యంగా ఐపీఎల్‌లో వ్యాపారం, క్రీడల మధ్య సంబంధం గురించి కొత్త చర్చకు తెరలేపాయి.

# SPORTS

# కెప్టెన్‌గా రిషబ్ పంత్..



రెండు నెలల పాటు క్రికెట్ అభిమానులను ఉరూతలూగించిన ఐపీఎల్-2025 సీజన్‌కు మంగళవారం(జూన్ 3) ఎండ్‌కార్డ్ పడిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్ విజేతగా నిలిచిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. తమ 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. అయితే ఈ ఏడాది సీజన్‌లో ఎటువంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన సాయిసుదర్శన్(ఆరెంజ్ క్యాప్ విన్నర్), ప్రసిద్ధ్ కృష్ణ(పర్పుల్ క్యాప్ విజేత) అద్భుతమైన ప్రదర్శనతో అదరగొట్టగా.. రిషబ్ పంత్, వెంకటేష్ అయ్యర్ వంటి ఖరీదైన ఆటగాళు తీవ్ర నిరాశపరిచారు. ఈ క్రమంలో ఐపీఎల్-2025లో విఫలమైన ఆటగాళ్లతో కూడిన ప్లేయింగ్ ఎలెవన్‌ను ఓ న్యూస్ వెబ్‌సైట్ ప్రకటించింది.

రచిన్ రవీంద్ర

మెగా వేలంలో న్యూజిలాండ్ స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్రను చెన్నై సూపర్ కింగ్స్ రూ. 4 కోట్లకు కొనుగోలు చేసింది. కానీ రవీంద్ర మాత్రం తన మార్క్‌ను చూపించలేకపోయాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన రవీంద్ర.. 8 మ్యాచ్‌ల్లో 191 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

ఇషాన్ కిషన్..

ఇషాన్ కిషన్‌పై సన్‌రైజర్స్ హైదరాబాద్ భారీ అంచనాలు పెట్టుకుంది. ఈ క్రమంలోనే అతడిపై రూ.11.25 కోట్ల భారీ ధర ఎస్ఆర్‌హెచ్ వెచ్చించింది. కానీ కిషన్ మాత్రం అంచనాల తగ్గట్టు రాణించిలేకపోయాడు. తొలి మ్యాచ్‌లో సెంచరీ చేసిన కిషన్.. తిరిగి మళ్లీ ఆఖరి మ్యాచ్‌లో మెరిశాడు. మిగితా మ్యాచ్‌ల్లో దారుణంగా విఫలమయ్యాడు. ఓవరాల్‌గా 14 మ్యాచ్‌లు ఆడి 354 పరుగులు చేశాడు.

రిషబ్ పంత్..

ఐపీఎల్-2025 మెగా వేలంలో టీమిండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ రిషబ్ పంత్‌ను లక్నో సూపర్ జెయింట్స్ రూ. 27 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది.

ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచిన పంత్.. తన ధరకు తగ్గ న్యాయం చేయలేకపోయాడు. ఆఖరి మ్యాచ్‌లో సెంచరీ మినహా మిగితా మ్యాచ్‌లలో విఫలమయ్యాడు. 13 మ్యాచ్‌లలో 269 పరుగులు మాత్రమే చేయగలగాడు. సదరు వెబ్‌సైట్ ఈ జట్టుకు పంత్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేసింది.

వెంకటేశ్ అయ్యర్..

మధ్యప్రదేశ్‌కు చెందిన వెంకటేశ్ అయ్యర్ ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఖరీదైన మూడో ఆటగాడిగా నిలిచాడు. అయ్యర్‌ను ఐపీఎల్ మెగా వేలంలో రూ.23.75 కోట్లకు కేకేఆర్ కొనుగోలు చేసింది. కానీ అయ్యర్ మాత్రం పూర్తిగా తేలిపోయాడు. సీజన్ మొత్తంలో అతడు 11 మ్యాచ్‌లలో 7 ఇన్నింగ్స్ లు మాత్రమే ఆడి, 142 పరుగులు చేశాడు. మిగిలిన రెండు మ్యాచ్‌లకు బెంచ్‌కే పరిమితమయ్యాడు.

గ్లెన్ మాక్స్‌వెల్..

పంజాబ్ కింగ్స్ తరఫున ఆడిన గ్లెన్ మాక్స్‌వెల్ సైతం తీవ్ర నిరాశపరిచాడు. ఈ ఆసీస్ స్టార్ 6 మ్యాచ్‌లు ఆడి 48 పరుగులతో పాటు కేవలం 4 వికెట్లు మాత్రమే పడగొట్టాడు.

నితీష్ కుమార్ రెడ్డి

ఐపీఎల్-2025 సీజన్‌కు ముందు నితీష్ కుమార్ రెడ్డిని ఎస్ఆర్‌హెచ్ రిటైన్ చేసుకుంది. గతేడాది ఎమర్జింగ్ ప్లేయర్‌గా నిలిచిన నితీష్.. ఈ ఏడాది సీజన్ మాత్రం దారుణ ప్రదర్శన కనబరిచాడు. 14 మ్యాచ్‌లు ఆడి 182 పరుగులతో పాటు 2 వికెట్లు పడగొట్టాడు.

ధోని(వికెట్ కీపర్)

సీఎస్‌కే దిగ్గజం ఎంఎస్ ధోనికి ఇది మర్చిపోలేని సీజన్. ఈ ఏడాది ధోనికి చాలా మ్యాచ్‌లలో బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చినప్పటికి సద్వినియోగ పరచుకోలేకపోయాడు. 14 మ్యాచ్‌ల్లో 135 పరుగులు చేశాడు.

వీరితో స్టార్ ప్లేయర్లు రషీద్ ఖాన్(గుజరాత్ టైటాన్స్), రవిచంద్రన్ అశ్విన్(సీఎస్‌కే), మహ్మద్ షమీ(ఎస్ఆర్‌హెచ్), దీపక్ చాహర్ సైతం తీవ్ర నిరాశపరిచారు.

Worst Playing XI of IPL 2025:: రచిన్ రవీంద్ర, ఇషాన్ కిషన్, రిషబ్ పంత్(కెప్టెన్), నితీష్ కుమార్ రెడ్డి, ధోని(వికెట్ కీపర్), మాక్స్‌వెల్, వెంకటేశ్ అయ్యర్,రషీద్ ఖాన్, రవిచంద్రన్ అశ్విన్,మహ్మద్ షమీ,దీపక్ చాహర్

# కోహ్లి, రోహిత్ ఉన్నా లేకున్నా ఒకేలా ఉంటుంది





టీమిండియా టెస్టు కెప్టెన్‌గా తొలి సవాల్‌ను ఎదుర్కొనేందుకు శుబ్‌మన్ గిల్ సిద్ధమయ్యాడు. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం గిల్ సారథ్యంలోని భారత జట్టు శుక్రవారం ఇంగ్లండ్‌కు పయనమైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి వంటి దిగ్గజాలు లేని భారత జట్టును గిల్ ఎలా నడిపిస్తాడో అని అందరూ ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇక ఇంగ్లండ్‌కు బయలుదేరే ముందు బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో శుబ్‌మన్ గిల్ మీడియాతో మాట్లాడాడు. ఈ సందర్భంగా ఇంగ్లండ్ పర్యటనకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు. అదేవిధంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి రిటైర్మెంట్‌లపై కూడా గిల్ మాట్లాడాడు. “సాధారణంగా ప్రతీ టూర్‌లోనూ ఒత్తిడి ఉంటుంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలు టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడం మాకు నిజంగా గట్టి ఎదురుదెబ్బ అని చెప్పాలి. వారిద్దరూ చాలా అనుభవజ్ఞులైన ఆటగాళ్ళు. భారత జట్టుకు ఎన్నో అద్భుతమైన విజయాలు అందించారు. వారి స్థానాలను భర్తీ చేయడం చాలా కష్టం. అయితే రోహిత్, కోహ్లి ఉన్నప్పుడు ఎలాంటి ఒత్తిడి ఉంటుందో ఇప్పుడు కూడా అలానే ఉంటుంది. అందులో ఎటువంటి మార్పు ఉండదు. మా బ్యాటింగ్ ఆర్డర్‌ను ఇంకా మేము ఖారారు చేయలేదు. అందుకు మాకు ఇంకా రెండు వారాల సమయం ఉంది. లండన్‌లో 10 రోజుల ప్రాక్టీస్ క్యాంపును నిర్వహిస్తాము. ఇంట్రా-స్క్వాడ్ మ్యాచ్‌లు ఆడతాము. ఆ తర్వాత బ్యాటింగ్ ఆర్డర్‌ను నిర్ణయిస్తాము అని గిల్ ప్రెస్‌కాన్ఫరెన్స్‌లో పేర్కొన్నాడు. కాగా ఈ సిరీస్ జూన్ 20 నుంచి ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌తోనే డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌కు తెరలేవనుంది.

ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు: శుబ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్, యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, సాయి సుదర్శన్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, నితీష్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, శార్దూల్ ఠాకూర్, జస్‌ప్రీత్ బుమ్రా, మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్, కుల్దీప్ యాదవ్

# ఐపీఎల్ 2025 జట్టు ప్రకటన.. కెప్టెన్ ఎవరంటే..?



ఐపీఎల్ 2025 సీజన్ జూన్ 3న జరిగిన ఫైనల్‌తో ముగిసింది. ఫైనల్లో ఆర్సీబీ పంజాబ్ కింగ్స్‌ను ఓడించి ఛాంపియన్‌గా అవతరించింది. ఐపీఎల్‌లో ఆర్సీబీకి ఇది తొలి టైటిల్. 18 ఏళ్ల ప్రస్తానంలో ఆ జట్టు మూడు సార్లు ఫైనల్‌కు చేరినా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. నాలుగో ప్రయత్నంలో ఆ జట్టు టైటిల్‌ను ఎగరేసుకుపోయింది.

పంజాబ్ విషయానికొస్తే.. ఈ జట్టు 11 ఏళ్ల తర్వాత ఫైనల్‌కు చేరింది. రెండో ప్రయత్నంలోనూ ఆ జట్టుకు నిరాశే మిగిలింది. సీజన్ ఆద్యాంతం అద్భుతంగా రాణించినా పంజాబ్ తుది మెట్టుపై బోల్తా పడింది. కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఆ జట్టును గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు. ఫైనల్లో ఓడినా పంజాబ్ మంచి మార్కులే కొట్టేసింది. ముఖ్యంగా ఆ జట్టు కెప్టెన్ శ్రేయస్ విమర్శకుల ప్రశంసలు కూడా అందుకున్నాడు. శ్రేయస్ ఐపీఎల్‌లో మూడు వేర్వేరు ఫ్రాంచైజీలను ఫైనల్‌కు చేర్చిన తొలి కెప్టెన్‌గా చరిత్రకెక్కాడు. ఇదిలా ఉంటే, ఐపీఎల్ 2025 టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్‌ను తాజాగా ప్రకటించారు. ఈ జట్టుకు సారధిగా పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఎంపికయ్యాడు. ఈ జట్టులో ఈ సీజన్ స్టార్లందరికీ చోటు దక్కింది. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం ఈ జట్టులో చోటు దక్కించుకో లేక పోయాడు. ఈ జట్టులో అత్యధికంగా నలుగురు ఆర్సీబీ ఆటగాళ్లకు చోటు దక్కింది. స్టార్ బ్యాటర్ విరాట్ కొహ్లి సహా జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యా, జోష్ హాజిల్‌వుడ్ చోటు దక్కించుకున్నారు. వికెట్‌కీపర్‌గా జితేశ్ శర్మ ఎంపికయ్యాడు. ఇంపాక్ట్ సబ్‌గా సీఎస్‌కే స్పిన్నర్ నూర్ అహ్మద్‌ను ఎంపిక చేశారు. ఈ జట్టుకు ఓపెనర్లుగా విరాట్ కోహ్లి, గుజరాత్ ఆటగాడు సాయి సుదర్శన్ ఎంపిక కాగా.. వన్‌డౌన్‌లో లక్నో సూపర్ జెయింట్స్ ఆటగాడు నికోలస్ పూరన్, నాలుగో స్థానంలో ముంబై విధ్వంసకర బ్యాటర్ సూర్యకుమార్, ఐదో స్థానంలో శ్రేయస్ అయ్యర్, ఆరో స్థానంలో జితేశ్ శర్మ, ఏడో ప్లేస్‌లో శశాంక్ సింగ్, ఆల్‌రౌండర్ల కోటాలో కృనాల్ పాండ్యా, స్పెషలిస్ట్ పేసర్లుగా బుమ్రా, హాజిల్‌వుడ్, ప్రసిద్ధ్ కృష్ణ ఎంపికయ్యారు. ఈ సీజన్‌లో అత్యుత్తమ ప్రదర్శనలు కనబర్చిన ఆటగాళ్లతో ఈ జట్టు ఎంపిక జరిగింది.

పంజాబ్ లోయర్ మిడిలార్డర్ బ్యాటర్ శశాంక్ సింగ్‌కు ఈ జట్టులో అనూహ్యంగా చోటు దక్కింది. ఐపీఎల్ 2025 టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్: విరాట్ కోహ్లి, సాయి సుదర్శన్, నికోలస్ పూరన్, సూర్యకుమార్ యాదవ్, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), జితేశ్ శర్మ (వికెట్‌కీపర్), శశాంక్ సింగ?, కృనాల్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, జోష్ హాజిల్‌వుడ్, ప్రసిద్ధ్ కృష్ణ, నూర్ అహ్మద్ (ఇంపాక్ట్ ప్లేయర్)

# సినిమా చిత్రం

## బాహుబలి రీరిలీజ్.. తెలివైన ప్లాన్ వేసిన నిర్మాతలు



కొన్ని సంవత్సరాలుగా టాలీవుడ్ లో రీరిలీజుల ట్రెండ్ బాగా ఎక్కువైపోయింది. హిట్టూ, ఫ్లాపుతో సంబంధం లేకుండా సినిమాలను రీరిలీజ్ చేస్తున్నారు. ఆడియన్స్ కూడా ఈ ట్రెండ్ ను బాగా ఎంజాయ్ చేస్తూ కొత్త సినిమాలను మించి హంగామా చేస్తున్నారు. రీసెంట్ గా సూపర్ స్టార్ మహేష్ బాబు ఫ్లాప్ సినిమా ఖలేజా రీరిలీజ్ అయిన సంగతి తెలిసిందే. ఆ సినిమా సుమారు రూ.10 కోట్ల కలెక్షన్లను అందుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పటికీ ఖలేజా థియేటర్లలో ఆడుతుంది. ఖలేజా కంటే ముందుగా వచ్చిన ప్రభాస్ వర్షం సినిమాకు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. వీటన్నింటినీ చూసి టాలీవుడ్ లో మరిన్ని రీరిలీజ్ లను ప్లాన్ చేస్తున్నారు నిర్మాతలు. అందులో భాగంగానే బాహుబలి సినిమాను కూడా రీరిలీజ్ చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. బాహుబలి నిర్మాణ సంస్థ ఆర్కా మీడియా వర్క్స్ దీనికి సంబంధించిన పనులను ఆల్రెడీ మొదలుపెట్టేసిందని సమాచారం. అయితే బాహుబలి రీరిలీజ్ లో ఓ పెద్ద ట్విస్టు అందరినీ ఎగ్జైట్ అయ్యేలా చేస్తుంది. బాహుబలి సినిమా రెండు భాగాలుగా వచ్చిన సంగతి తెలిసిందే. బాహుబలి: ది బిగినింగ్, బాహుబలి: ది కంక్లూజన్ పేరుతో రాగా రెండు సినిమాలూ ఒకదాన్ని మించి మరొకటి హిట్లుగా నిలిచాయి. ఇందులో ఒక సినిమాను రీరిలీజ్ చేసి మరో సినిమాను రీరిలీజ్ చేయకపోతే ఆడియన్స్ కు సినిమా చూసిన ఎగ్జైట్‌మెంట్ ఉండదు. అలా అని రెండు సినిమాలనూ రీరిలీజ్ చేస్తే ఆడియన్స్ చూస్తారో లేదో అని అనుమానం కూడా. ఇక్కడే బాహుబలి నిర్మాతలు తెలివిగా ఆలోచించి ఓ పక్కా ప్లాన్ వేశారు. బాహుబలి రెండు పార్టుల్లోని అనవసర సీన్స్ ను తీసేసి, బాగా ఇంట్రెస్టింగ్ ఎపిసోడ్స్ ను కలిపి సినిమాను ఓ భాగంగానే రిలీజ్ చేయాలని చూస్తున్నారట. ఆల్రెడీ దీని కోసం ఎడిటింగ్ వర్క్స్ ను కూడా మొదలుపెట్టారని అంటున్నారు. ఈ వార్తలు నిజమైతే బాహుబలిని ఒకే కథగా చూడాలని చాలా మంది ఈ కారణంతో థియేటర్లకు వచ్చే అవకాశముంది. రీరిలీజుల్లో కూడా బాహుబలి ట్రెండ్ సృష్టించడం ఖాయం.

## థగ్ లైఫ్.. మరి అంత దారుణమా?



స్టార్ హీరో కమల్ హాసన్-దిగ్గజ దర్శకుడు మణిరత్నం కాంబినేషన్ లో మూవీ అంటూ ప్రకటన రావడంతో సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అనేక ఏళ్ల క్రితం వారిద్దరూ కలిసి వర్క్ చేసిన నాయగన్ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. బాక్సాఫీస్ వద్ద ఓ రేంజ్ లో సందడి చేసింది. ఆ తర్వాత మళ్లీ కలిసి పని చేయలేదు. దీంతో థగ్ లైఫ్ మూవీకి గాను చేతులు కలుపుతారని అనౌన్స్మెంట్ రావడంతో మరో బ్లాక్ బస్టర్ పక్కా అని అంతా అనుకున్నారు. విడుదలకు ముందు మేకర్స్.. వరుస అప్డేట్స్ తో సందడి చేశారు. ప్రమోషన్స్ తో సినిమాపై బజ్ క్రియేట్ చేశారు. ట్రైలర్ తో భారీ లెవెల్ లో అంచనాలు పెంచేశారు. కానీ సినిమా రిలీజయ్యాక సీన్స్ రివర్స్. రొటీన్ గ్యాంగ్ స్టర్ ఫ్యామిలీ డ్రామా మూవీ అని అనేక మంది రివ్యూస్ ఇచ్చారు. ఎక్కడో కొన్ని సీన్స్ తప్ప.. మణిరత్నం మార్క్ మిస్ అయిందని అన్నారు. అంచనాలను అస్సలు అందుకోలేకపోయిందని చెప్పారు. దాదాపు సినిమా అంతా రొటీన్ గా ఉందని.. చాలా వరకు సన్నివేశాలన్నీ ఊహించేలా ఉంటాయని పేర్కొన్నారు. కమల్ హాసన్ మాత్రం ఎప్పటిలాగే తన నటనతో ఆకట్టుకున్నారని ప్రశంసలు వస్తున్నాయి. తన పాత్రలో జీవించేశారని అంతా చెబుతున్నారు. కానీ ఓవరాల్ గా మాత్రం మూవీ అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో సోషల్ మీడియాలో ఫుల్ ట్రోల్స్ వస్తున్నాయి. ఇదేం సినిమారా బాబోయ్ అంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు. అంతే కాదు.. అనేక వెబ్ సైట్స్ ఇచ్చిన రేటింగ్స్ ను కూడా పోస్ట్ చేస్తున్నారు. సాధారణంగా ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్ ఫామ్ బుక్ మై షోలో ప్రతి మూవీకి రేటింగ్ ఉంటుంది. ఇప్పుడు థగ్ లైఫ్ మూవీకి 5.2 రేటింగ్ వచ్చింది. దీంతో ఇప్పుడు ఆ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. నెటిజన్లు ఫుల్ గా స్పందిస్తున్నారు. ఇప్పటికే ఎన్నో సినిమాలు డిజాస్టర్స్ అయినా.. ఫస్ట్ డే మినిమమ్ 7 రేటింగ్ అయినా వస్తుందని.. కానీ థగ్ లైఫ్ రేటింగ్ షాకింగ్ గా కొందరు ఉందని చెబుతున్నారు. ఇది సినిమాకు మరో ఎదురుదెబ్బ అని మరికొందరు కామెంట్లు పెడుతున్నారు. మూవీ మరీ అంత దారుణంగా ఉందా అని ఇంకొందరు క్వశ్చన్ చేస్తున్నారు.

## ముసుగులు తీసేశారు.. బన్నీ వాస్ 'మిత్రమండలి' ఇదే!

టాలీవుడ్ ప్యాషనేటెడ్ నిర్మాతల్లో ఒకరైన బన్నీ వాస్.. తన సొంత బ్యానర్ బీవీ వర్క్స్ పై ఫస్ట్ సినిమాను రూపొందిస్తున్న విషయం తెలిసిందే. సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ తో కలిసి ఆయన నిర్మిస్తున్న మూవీ ప్రీ లుక్ పోస్ట్ రీసెంట్ గా రిలీజైంది. ఆడియన్స్ నుంచి సూపర్ రెస్పాన్స్ అందుకుని సందడి చేసింది. ముఖ్యంగా ముసుగులు వేసుకున్న యాక్టర్స్ ఎవరో తెలుసుకోవాలన్న ఇంట్రెస్ట్ క్రియేట్ అయింది. ఇప్పుడు మేకర్స్.. ఆ ముసుగులు వేసుకున్నదెవరో రివీల్ చేశారు. సినిమా టైటిల్ ను ప్రకటించారు. ప్రస్తుతం మేకర్స్ రిలీజ్ చేసిన పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మూవీపై అప్పుడే మంచి బజ్ కూడా క్రియేట్ చేసింది. అనే టైటిల్ ను ఫిక్స్ చేయగా.. ఫస్ట్ లుక్ పోస్టర్ అందరినీ ఆకట్టుకుందనే చెప్పాలి. పోస్టర్ లో ముసుగు వేసిన గ్యాంగ్ ను మేకర్స్ పరిచయం చేశారు. తద్వారా ప్రియదర్శి , రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా లీడ్ రోల్స్ పోషిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా స్టార్ నిహారిక కూడా సినిమాలో యాక్ట్ చేస్తున్నారు.



అయితే ఇప్పటికే ప్రియదర్శి తన యాక్టింగ్ తో ఇండస్ట్రీలో మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. మ్యాడ్ ఫేమ్ విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా టాలెంట్ గురించి తెలిసిందే. నిహారిక.. సోషల్ మీడియా ద్వారా సూపర్ ఫేమ్ సొంతం చేసుకున్నారు. ఇప్పుడు వారంతా మిత్రమండలి మూవీతో ఫుల్ ఫన్ అందిస్తారని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. బన్నీ వాస్ సమర్పిస్తున్న మిత్రమండలి మూవీని కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్నారు. సోమరాజు పెన్మెత్స సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. నూతన దర్శకుడు విజయేందర్ దర్శకత్వం వహిస్తున్నారు. వీరితోపాటు అద్భుతమైన సాంకేతిక నిపుణులను కూడా రంగంలోకి దించారు మేకర్స్. ఆర్.ఆర్. ధృవన్ సంగీతం అందిస్తుండగా.. సినిమాటోగ్రాఫర్ గా సిద్ధార్థ్ ఎస్.జె వర్క్ చేస్తున్నారు. ఎడిటర్ గా పీకే, ఆర్ట్ డైరెక్టర్ గా గాంధీ నడికుడికర్, కాస్ట్యూమ్ డిజైనర్ గా శిల్పా టంగుటూరు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా రాజీవ్ కుమార్ రామా వర్క్ చేస్తున్నారు. స్నేహం ప్రధానంగా నడిచే కథతో సినిమా రూపొం దుతోంది. త్వరలో మరిన్ని అప్డేట్స్ కూడా ఇవ్వనున్నారు మేకర్స్.

## నమ్రత మేడం సర్ మేడం అంతే..!



ఈ జనరేషన్ ప్రేక్షకులకు నమ్రత శిరోద్కర్ కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే తెలుసు. కానీ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్తే ఆమె స్థాయి ఏంటో అందరికీ అర్థం అవుతుంది. 1993లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుంది. హిందీలో ఎన్నో సినిమాల్లో నటించి సూపర్ హిట్స్‌ను సైతం అందుకుంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో పాటు పలు సినిమాల్లో నటించింది. మహేష్ బాబుతో ప్రేమలో పడ్డ నమ్రత శిరోద్కర్ ఆయన్ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయింది. ఆమె ఫ్యామిలీ వ్యవహారాలు చూసుకుంటే ఈ జనరేషన్‌కి కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే గుర్తు ఉండి పోయేలా ఆమె లో ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ వస్తుంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నమ్రత తన హద్దులు దాటకుండా, పరిధిలో ఉంటూ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. చాలా మంది పెళ్లి అయిన హీరోయిన్స్ అందాల ఆరబోత చేస్తూ ఇప్పటికీ వార్తల్లో ఉన్నారు. వారి ఫామ్ కోల్పోయినా కూడా స్కిన్ షో చేయడం ద్వారా వార్తల్లో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్న వారు కొందరు ఉన్నారు. కానీ నమ్రత మాత్రం ఎప్పుడూ చాలా హుందగా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఆమె తన గౌరవ, మర్యాదలు కాపాడుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. నమ్రత భార్య కావడం అనేది మహేష్ బాబు అదృష్టం అంటూ చాలా మంది అభిమానులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నమ్రత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అందమైన ఫోటోలను షేర్ చేసింది. విభిన్నమైన డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన నమ్రత అంతే స్టైలిష్ ఆభరణాలు ధరించడం ద్వారా చాలా ఆకర్షణీయంగా కనిపించింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ నమ్రత సొంతం అంటూ ఉంటారు. ఆమె వయసు పెరిగినా కొద్ది మరింత అందంగా కనిపిస్తుందని, మిస్ ఇండియా సమయంలో ఎంత అందంగా ఉందో అంతే అందంగా కనిపిస్తుందని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి నమ్రత సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలను రెగ్యులర్‌గా షేర్ చేయాలని అభిమానులు కోరుకుంటూ ఉన్నారు. తరుణ్ తాహిళాని డిజైన్ చేసిన ఈ ఔట్ ఫిట్ నమ్రత ధరించడంతో మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నమ్రత ఏ ఫోటోలు షేర్ చేసినా వెంటనే వైరల్ అవుతూ ఉంటాయి. ఎక్కువ శాతం తన పిల్లలు గౌతమ్, సితార ఫోటోలను షేర్ చేస్తూ ఉండే నమ్రత ఈసారి మాత్రం తన పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న నమ్రత ఎందుకు సినిమాలకు దూరం అయిందని అభిమానులు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల బాధ్యత ఉన్న కారణంగా అప్పుడు సినిమాలకు దూరంగా ఉన్న నమ్రత ఇప్పుడు అయినా రీ ఎంట్రీ ఇవ్వచ్చు కదా అంటున్నారు. ఆ మధ్య రేణు దేశాయ్ తో పాటు పలువురు రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. వారిలాగే నమ్రత ఏదో ఒక రోజున రీ ఎంట్రీ ఇస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి నమ్రత మనసులో ఏముందో తెలియాల్సి ఉంది.



## 'స్పిరిట్' ని కోల్పోయాక దీపిక నష్టం ఎంతో తెలుసా?

బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపిక పదుకొనే బ్యాక్ టు బ్యాక్ క్రైసిస్ లో పడటంపై ఫిలింసర్కిల్స్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్ లో 'కల్కి 2898 ఏడి' లాంటి పాన్ ఇండియన్ బ్లాక్ బస్టర్లో నటించిన దీపిక నిజానికి ఆ సనిమా సెట్స్ లో ప్రవేశించక ముందే 'ఫెమినిజం' ఎజెండాను తెరపైకి తెచ్చింది. మేల్ డామినేటెడ్ ఇండస్ట్రీపై సర్జికల్ స్ట్రైక్స్ కి ప్రయత్నించింది. అప్పటికి అది సమస్య కాలేదు. కొన్నాళ్ల పాటు ఫెమినిజం హవాను సాగించింది కానీ, సందీప్ రెడ్డి వంగా ముందు ఎలాంటి హవా పని చేయలేదు. స్ట్రైక్స్ మిస్ ఫైర్ అయి ఊహించని రిజల్ట్ ని ఎదుర్కొంది. సంగతి తెలిశాక, క్షణాల్లో నిర్ణయం తీసుకోగల మిసైల్ లాంటోడు సందీప్ వంగా. అతడు కొన్ని నిమిషాల్లోనే తీసుకున్న ఒక కఠోరమైన నిర్ణయం దీపిక కు మైండ్ బ్లాంక్ అయ్యేలా చేసింది. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ వంగా తెరకెక్కిస్తున్న 'స్పిరిట్' నుంచి దీపిక పదుకొనేను తొలగించడం బిగ్ బ్లో ట్రీట్. క్షణాల్లోనే ట్రిప్తి దిమ్రీని ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేసుకుని ఇంకా పెద్ద షాకిచ్చాడు. ఇది ఊహించనిది. ఆ తర్వాత 'స్పిరిట్- ఏ రేటెడ్ సినిమా!' అంటూ దీపిక పీఆర్ ప్రాజెక్ట్ ను తక్కువ చేసేందుకు, డ్యామేజ్ చేసేందుకు ప్రయత్నించింది. చివరికి పీఆర్ టాక్సిక్ టాక్టిక్స్ గురించి కూడా సందీప్ వంగా సోషల్ మీడియాల్లో విరుచుకుపడ్డాడు. చెత్త పీఆర్ ట్రిక్స్ పై ధుమధుమలాడాడు. అయితే దీపిక బ్యాడ్ టైమ్ ఇక్కడితో ముగిసిపోలేదు. ఈ భామ రెక్లెస్ యాటిట్యూడ్ కారణంగా 'స్పిరిట్' నుంచి తొలిగించారనే సమాచారం వెలువడ్డాక, బాలీవుడ్ లో ఫెమినిస్ట్ కథానాయికలందరిలో షివరింగ్ మొదలైంది. సీనియర్ నటి కాజోల్, కరీనా సహా చాలా మంది ఫెమినిజానికి బ్రాండ్ అంబాసిడర్లుగా ఉండే కథానాయికలు, తమకు అవకాశాలు ఇలాంటి ఒక కారణంతో గాల్లో కొట్టుకుపోతే పరిస్థితి ఉందని అర్థం చేసుకున్నారు. చాలామంది భయపడ్డారు. ఫీమేల్ ఆర్టిస్టులను గౌరవించి వారి కోసం బలమైన పాత్రలను రాసుకునే సందీప్ వంగా ఇలా చేసాడేమిటీ? అనే భయం మొదలైంది. ఇప్పుడు దీపికకు అవకాశాలిచ్చిన ఇతర నిర్మాతలు కూడా దీనిపై ఆలోచిస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీపిక ఇప్పటికే 'కాక్ టైల్ 2'లో అవకాశం కోల్పోయింది. అయితే దానికి కారణం వేరు కావొచ్చు. కానీ కెరీర్ లో మరో పెద్ద ఆఫర్ ని కోల్పోయింది. బ్లాక్ బస్టర్ 'కాక్ టైల్'లో దీపిక- సైఫ్ రొమాన్స్ అద్భుతంగా వర్కవుటైంది. కానీ కాక్ టైల్ సీక్వెల్ లో ఇప్పుడు షాహిద్ - రష్మిక జంటను ఎంపిక చేసుకున్నారు మేకర్స్. ఇందులో కృతి సనోన్ కూడా ఒక కథానాయిక. స్పిరిట్ నుంచి వైదొలిగాక బ్యాడ్ టైమ్ రన్ అవ్వడం అంటే ఇదే! మరోవైపు బ్లాక్ బస్టర్ 'కల్కి 2898 ఏడి' సీక్వెల్ పై నాగ్ అశ్విన్- అశ్వనిదత్ బృందం పని చేస్తున్నారు. ఈ సినిమాలో దీపిక కొనసాగుతుందా లేదా? అన్నది ఇంకా క్లారిటీ లేదు. దీపిక వైఖరి తెలిసిన దత్ బృందం ఇప్పుడు సీక్వెల్ లో అవకాశం కల్పిస్తుందా? అన్నది వారి విజ్ఞతికే వదిలేయాలని ఫిలింనగర్ లో గుసగుసలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రస్తుతం చర్చల దశలో ఉన్న వేరొక సినిమాలోను దీపిక అవకాశం కోల్పోయిందని టాక్ విని పిస్తోంది. ముఖ్యంగా పీఆర్ టాక్టిక్స్ దీపికకు మినిమంగా రూ. 50 కోట్ల మేర కొద్దిరోజుల్లోనే నష్టం కలిగించాయని గుసగుసలు వినిపిస్తున్నాయ్.



## ఈ మిస్సు దురదృష్ట నాయిక ఎందుకు అంటే?



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ సరసన - ఆపరేషన్ వేలెంటైన్ - లో నటించింది మానుషి చిల్లర్. తనదైన అందం, నటనతో ఆకట్టుకున్నా కానీ, ఆ తర్వాత తెలుగులో అవకాశాలు అందుకోలేదు. ఈ భామ బాలీవుడ్ లో పృథ్వీరాజ్ అనే హిస్టారికల్ మూవీలో ఖిలాడీ అక్షయ్ కుమార్ సరసన నటించింది. అక్కడ కూడా సరైన విజయాల్లేవ్. ప్రపంచ సుందరిగా కిరీటం గెలుచుకుని, సినీరంగంలో ప్రవేశించిన మానుషికి ఈ రంగంలో సరైన అవకాశాల్లేవ్. ఇప్పటివరకూ అందాల పోటీల నుంచి వచ్చిన చాలా మంది భామలతో పోలిస్తే, మానుషి దురదృష్ట నాయిక అనడంలో ఎలాంటి సందేహాల్లేవ్. మానుషి నటిగా ఎంట్రీ ఇచ్చాకే మూడేళ్ల పాటు కరోనా క్రైసిస్ తీవ్ర ఆటంకాల్ని కలిగించింది. ఆ రకంగా కూడా మానుషి ఎదుగుదలకు చెక్ పడింది. అయినా పట్టువదలని విక్రమార్కుని సోదరిలా మానుషి అవకాశాల కోసం ప్రయత్నిస్తూనే ఉంది. అయితే మానుషి ఇటీవల స్త్రీ వాదాన్ని బయటపెట్టడం ఇండస్ట్రీలో చర్చగా మారింది. వినోద పరిశ్రమలో మహిళల పట్ల ఉన్న అవగాహన గురించి మానుషి చిల్లార్ మాట్లాడుతూ, స్త్రీలు నిరంతరం అగౌరవం, ధిక్కారం కారణంగా చర్చల్లోకొస్తారని వ్యాఖ్యానించింది. సినీ పరిశ్రమలో స్త్రీ ద్వేషపూరిత వైఖరిని మానుషి విమర్శించారు. స్త్రీ ద్వేషపూరిత మనస్తత్వం కారణంగా, స్త్రీ విజయాన్ని ఆమెకు ఆపాదించకుండా, పురుషుడి పోషణకు ఆపాదించడం సులభం. వాస్తవ ప్రపంచంలో ఎటువంటి ప్రభావం చూపని తెలివితక్కువ కామెంట్లను నేను ఎప్పుడూ విస్మరించాను.. కానీ నిరంతరం పని చేసే మహిళల విషయంలో, ముఖ్యంగా వినోద పరిశ్రమలో అలాంటి అగౌరవం, ధిక్కారాలను చూస్తున్నాను.. అని వ్యాఖ్యానించారు. నేను సాధికారత కలిగిన, విద్యావంతులైన వాతావరణంలో పెరిగాను, అక్కడ లింగభేధంతో సంబంధం లేదు. అందరికీ సమాన విలువ ఉంటుంది. కానీ నేను కూడా ఇండస్ట్రీలో అవమానాలకు గురయ్యాను.. అని తెలిపింది. మగవాళ్లు కష్టపడి పనిచేస్తారు..విజయం సాధిస్తే ప్రతిభావంతులు.. అయితే మహిళలు అవకాశవాదులు.. గోల్డ్ డిగ్గర్స్.. మానిప్యులేటర్లు! ఇలాంటి చెడు విన్నాను... అని తెలిపింది. మానుషి 2017లో ప్రపంచ సుందరి కిరీటం గెలుచుకుంది. ఇతర అందాల భామల్లానే వెండితెర కలలను నిజం చేసుకునేందుకు బాలీవుడ్ లో అడుగుపెట్టింది. స్టార్ హీరో అక్షయ్ కుమార్ సరసన చారిత్రాత్మక డ్రామా సామ్రాట్ పృథ్వీరాజ్ చిత్రంతో బాలీవుడ్‌లో రంగ ప్రవేశం చేసింది. విక్కీ కౌశల్ సరసన ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ, వరుణ్ తేజ్ సరసన ఆపరేషన్ వాలెంటైన్ వంటి ప్రాజెక్టులను చేసింది. అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్, అలయ ఎఫ్ నటించిన బడే మియాన్ చోటే మియాన్‌లోను మానుషి కనిపించింది. ఇవన్నీ ఫ్లాప్ సినిమాలు. తదుపరి జాన్ అబ్రహంతో కలిసి టెహ్రాన్ చిత్రంలో కనిపించనుంది.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.